**Maha Kavitha Vasantham**

**మహా కవితా వసంతం**

ప్రచురణ : **సరస భారతి** – సాహిత్య సాంస్కృతిక సంస్థ ఉయ్యూరు.

ప్రథమ ముద్రణ - 600 ప్రతులు

శ్రీ వికృతి - భాద్రపద మాసం

**సెప్టెంబర్ - 2010**

ప్రతులకు : **గబ్బిట దుర్గా ప్రసాద్,**

అధ్యక్షులు, సరసభారతి

ఇ.నెం. 2-405, శివాలయం వీధి

రాజాగారి కోట దగ్గర

**ఉయ్యూరు - 521165**

కృష్ణాజిల్లా.

ఫోన్ నెం. : 08676-232797

సెల్ నెం. : 99890 66375

ఇ.మెయిల్ : gabbita.prasad@gmail.com

sarasabharathi.vuyyuru@gmail.com

ధర : అమూల్యం

డి.టి.పి. : **వి.జి. షాప్, ఉయ్యూరు**

సెల్ నెం. : 9849705663

ముద్రణ : **శ్రీ రామా గ్రాఫిక్స్, గాయిత్రీ గురుకులము,**

**ఉయ్యూరు.**




మహా కవితా వసంతం

# మహా కవితా వసంతం

( శ్రీ వికృతి ఉగాది కవితా సంపుటి )

**అంకితం**



స్వర్గీయ **టి. ఎల్. కాంతారావు**

**ప్రముఖ సాహితీ విమర్శకులు**

సంపాదకులు

**గబ్బిట దుర్గాప్రసాద్**

ఎమ్.ఏ., బి.యస్‌సి., బి.యిడి.

ప్రచురణ

**సరసభారతి**

సాహిత్య సాంస్కృతిక సంస్థ, ఉయ్యూరు

కృష్ణాజిల్లా

సరసభారతి

## స్మృత్యంజలి

– గబ్బిట దుర్గా ప్రసాద్

ఈ వికృతినామ ఉగాది మహాకవితా సంకలనాన్ని ‘మహాకవితా వసంతం’ పేరున ప్రచురించి కీ॥శే॥ టి.ఎల్. కాంతారావు గారికి అంకితం ఇస్తున్నాం. కాంతారావు గారి గురించి ఇప్పుడు కొన్ని వివరాలు తెలియజేస్తున్నాను. కాంతారావు, నేను ఉయ్యూరు జిల్లా పరిషత్ హైస్కూలులో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులుగా పనిచేశాం. ఆయన మా యింటి పక్కన అద్దెకుండేవారు. స్కూల్‌కు ఇద్దరం కలసి వెళ్ళి వచ్చేవారం. నన్ను ‘గురూగారూ’ అని గౌరవంగా సంబోధించేవారు. మంచి మిత్రుడు, స్నేహానికి ప్రాణం ఇచ్చేవారు, బోళా మనిషి. ఆయన కుటుంబం, మా కుటుంబం అన్యోన్యంగా ఉండేవి. ఆయన మంచి ఉపాధ్యాయుడు. బోధనా పటిమ బాగా ఉండేది. ఇద్దరం కలసి ఎమ్.ఏ తెలుగు పరీక్ష రాసి 1972లో ఆంధ్రవిశ్వవిద్యాలయం నుండి పట్టా పొందాం. పగలు స్కూల్, రాత్రి వేళ మా యింటి దగ్గర కంబైన్డ్ స్టడీ. మిత్రుడు వి.చెంచారావు కూడా మాకు తోడు. మా పరీక్ష కేంద్రం గుంటూరు. కాంతారావుకు ఒకసారి చదివితే మళ్ళీ చదివే పని ఉండేది కాదు. మనస్సులోను, మెదడులోను ముద్రపడి ఉండేది. శ్రీశ్రీ గేయాలు ఆయన నోట అనుక్షణం నర్తించేవి. అలాగే తిలక్ కవిత్వంకూడా. ఆయనకు ఇద్దరూ రెండు కళ్ళు. ఆధునిక సాహిత్యానికి ద్వారాలు తెరిచి ప్రవేశం కల్గించి అభిమానం, అభిరుచి, అవగాహన నాకు కలిగించిన మిత్రుడు ఆయన. అప్పటికే భారతి, ఆంధ్ర ప్రభ, ఆంధ్రపత్రికలలో విమర్శ వ్యాసాలు రాస్తూ ఉండేవాడు. నేను ప్రతిదీ చదివేవాడిని. తను రాసిన ప్రతి రచన నాకు చూపించి పత్రికలకు పంపేవాడు. కాగితంమీద కలం పెడితే నాన్‌స్టాప్‌గా రాసేవాడు. చిన్న అక్షరాలతో సన్నని పాళిగల ఇంకు పెన్నుతో చీమల బారుగా రాసేవాడు. వ్యాసం పూర్తిఅయ్యేదాకా కలం దించేవాడు కాదు. అన్నీ వాచోవిధేయం కనుక ప్రక్కన రిఫరెన్స్ పుస్తకాల అవసరం ఉండేది కాదు. దేనికీ వెతుక్కునేవాడు కాదు. ప్రతిరోజు అర్ధరాత్రి దాకా ఎన్నో సాహిత్య విషయాలు మాట్లాడుకునేవాళ్ళం. ఆంగ్ల కవులు ఎజ్రాపౌండ్, జేమ్స్ జాయిస్, వాల్ట్‌విట్మన్, టి.యస్. ఇలియట్‌ల కవిత్వాలను పుష్కలంగా కోట్ చేస్తూ మంచి అవగాహన కల్గించేవాడు.

హైస్కూల్లో ఖాళీ సమయంలో కేరమ్స్ ఆడేవాళ్ళం. ఇందులో ఆయన ఎప్పుడూ ప్రత్యర్థే. మంచి ఆటగాడు. కాఫీ పందాలు వేసుకొని పోటా పోటీగా ఆడేవాళ్ళం.





## వసంత విహారం


| వ.సం. | | పుట సంఖ్య |
| --- | --- | --- |
| 1. | స్మృత్యంజలి | 01 |
| 2. | సరసభాషణం | 06 |
| 3. | మహా కవి సమ్మేళనం ముచ్చట్లు | 09 |
| 4. | మహా కవి సమ్మేళనం కవితలు | 14 |

అతను గొప్ప బాల్‌బ్యాడ్‌మింటన్ ప్లేయర్. పసుమర్తి ఆంజనేయశాస్త్రి అనే లెక్కల మాష్టరు, నేను, కాంతారావు, డ్రిల్ మాష్టర్లు వై.రామారావు, వై.పూర్ణచంద్రరావు, యస్.వి సుబ్బారావు, క్రాఫ్ట్ మాస్టర్ కె. రామ మోహనరావు స్కూల్ అవగానే చీకటి పడే దాకా బ్యాడ్‌మింటన్ ఆడేవాళ్ళం, ఆరగా ఆరగా కాఫీలు తాగుతూ, పోటీలు వేసుకుంటూ. వాలిబాల్ కూడా ఇంతే ఉత్సాహంగా ఆడేవాళ్ళం.

హైస్కూల్ సైన్స్ రూమ్ మాకు సాహిత్య వేదికగా ఉండేది. ఇంగ్లీష్ మాష్టరు వల్లభనేని రామకృష్ణారావు, తెలుగు పండిట్‌లు యమ్.జ్ఞానసుందరరావు, అన్నే పిచ్చిబాబు, వి.పూర్ణచంద్రరావు, హిందీ టీచర్ కొడాలి రామారావు,సెకండరీ గ్రేడు టీచర్లు మహంకాళి సుబ్బరామయ్య, కె.ఆర్. కాంతయ్య, సూరి రామశేషయ్య, వణుకూరి గరుడాచలం, డ్రాయింగ్ టీచరు తాడినాడ శేషగిరిరావు, నేను, కాంతారావు, ఆంజనేయశాస్త్రి, సోషల్ టీచరు లంక బసవాచారి అందరం కలసి నెలకు ఒక సమావేశం ఏర్పాటు చేసి, మాలో ఎవరో ఒకరితో ప్రసంగం చేయించేవాళ్ళం. మిగిలిన ఉపాధ్యాయులు హాజరు అయ్యేవారు. ఖర్చు మేమే భరించేవాళ్ళం. విశ్వనాథవారి రామాయణ కల్పవృక్షంపై అప్పుడు ఆకునూరు ప్రభుత్వ హైస్కూలులో తెలుగు పండితులుగా వున్న సుబ్బరాయశాస్త్రి గారు, రెంటచింతల నరసింహశాస్త్రి గార్లచే అద్భుతమైన ప్రసంగం ఏర్పాటుచేశాం. సంక్రాంతికి, ఉగాదికి కవిసమ్మేళనాలు నిర్వహించాం. నన్ను ప్రోత్సహించి తిలక్, కృష్ణశాస్త్రిలపై వ్యాసాలు రాయించాడు. వచన కవితకు మార్గం చూపాడు. ఆయన ప్రభావం నామీద చాలా వుంది.

ప్రముఖ రచయిత ఆలూరి భుజంగరావు పదునైన కవిత్వంతో, అధోజగత్సహోదరుల ఆర్తిని వెలువరించేవారు. ఆయన అప్పుడు సి.బి.ఎమ్ స్కూల్ హిందీ పండితులు. వంగల కృష్ణదత్తశర్మ గొప్ప సాహిత్యజీవి. ఆయన మాకు మంచి ప్రోత్సాహం యిచ్చేవారు. కవి సమ్మేళనంలో కె.సి.పి కెమిస్ట్‌గా వున్న టి.వి.సత్యనారాయణ, గరికపర్రు మునసబు గూడపాటి కోటేశ్వరరావు మొదలైన వారు పాల్గొనే వారు. అప్పుడే వేమన త్రిశతజయంతి వచ్చింది. దాన్ని చాలా ఘనంగా నిర్వహించాం. వేమన చిత్రాన్ని డ్రాయింగ్ మాస్టార్ శేషగిరిరావుగారు చిత్రించారు. ఇంద్రగంటి శ్రీకాంతశర్మను అధ్యక్షులుగా ఆహ్వానించాం. మన తరం మేధావి డా.జి.వి.కృష్ణారావును ముఖ్యఅతిథిగా ఆహ్వానించి వేమన కవిత్వంపై ఉపన్యసింపజేశాం. కృష్ణారావుగారికి నూతనవస్త్రాలు బహూకరించి ఘనసన్మానం చేశాం.





ఆయన్ను విజయవాడ నుండి కారులో నేను, కాంతారావువెళ్ళి తీసుకొనివచ్చాం. మళ్ళీ వెళ్ళి దింపి వచ్చాం. అలాంటి బుద్ధి జీవి ప్రక్కన కూర్చునే అదృష్టం, ఆయన ప్రసంగం వినే భాగ్యం కాంతారావు వల్లనే కలిగింది. అద్దేపల్లి రామమోహనరావుకు కాంతారావు ప్రియశిష్యుడు. ఆయన ఉయ్యూరు తరచుగా వస్తూండేవాడు. ఆయనతో మాకు చక్కని సాహిత్య కాలక్షేపం. మా ఇంట్లో భోజనం ఏర్పాటు చేసే వాళ్ళం. అలాగే రేడియో ఆర్టిస్టులు ఎ.బి. ఆనంద్, సుమన్, నండూరి సుబ్బారావులు కూడా ఉయ్యూరు వచ్చి మాతో సరదాగా గడిపేవారు. ఒక సారి దత్తుగారింట్లో పౌర్ణమినాడు రాత్రి మంచి సాహిత్య సభ నిర్వహించాం. జ్ఞానసుందరం, సుబ్బరామయ్య, హిందీ రామారావు వగైరాలు సాహిత్య ప్రసంగాలు చేశారు. టిఫిన్లు, కాఫీలు మా ఇంటినుంచి ఏర్పాటు చేశాం. అదొక వైభవం. సూపర్‌వైజర్ గొట్టిముక్కల పూర్ణచంద్రరావు, చెరకు విస్తరణాధికారి మీసాలరెడ్డిగారు, కాంతారావు, నేను, శాస్త్రి రామారావు వీడని బృందం. ఎన్నో సినిమాలు కలసి చూశాం. విజయవాడ రేడియోస్టేషన్ నిర్వహించే కవి సమ్మేళనాలకు వెళ్ళేవాళ్ళం.

బందరులో సింగరాజు రామచంద్రమూర్తి, అర్.ఎస్.కె మూర్తి, పువ్వాడ శేషగిరిరావు, విహారి, శాలివాహన, ఆదివిష్ణు, దొండపాటి దేవదాస్ వంటి రచయితలతో పరిచయం కాంతారావు వల్లనే కలిగింది. ఎమ్.వి.ఎల్. నరసింహారావు, మిరియాల రామకృష్ణ, మోహన ప్రసాద్, లత, బాలాంత్రపు రజనీ కాంతరావు, హిందీ సుమన్‌లను తరుచుగా కలుస్తూండేవాళ్ళం. కాంతారావు రేడియో ప్రసంగాల రికార్డింగ్‌కు అందరం కలసి వెళ్ళేవాళ్ళం. అరమరికలు లేని స్నేహం అది. ఇంత గొప్ప విమర్శకుడు మా స్నేహితుడు అంటే గర్వంగా వుండేది. యమ్.ఏ. పరీక్షలు రాసేటప్పుడు పరీక్షా కేంద్రం వద్ద కాంతారావు వ్రాసిన వ్యాసాలు విద్యార్థులు చదువుతూ పరీక్షకు తయారవుతూ వుంటే, వాళ్ళకు కాంతారావును పరిచయం చేస్తూంటే, వాళ్ళు విభ్రాంతికి గురయ్యేవారు. ఇద్దరం సెకండ్ క్లాస్‌లో పాసయ్యాం. ప్రముఖ కథా రచయిత, విమర్శకుడు, నటుడు శ్రీ గొల్లపూడి మారుతీ రావు ఉయ్యూరులో ఎమ్.ఎల్.ఏ వద్దే శోభనాద్రీశ్వరరావు గారి యింటికి వచ్చినపుడు నేను, కాంతారావు మిత్రబృందం కలసి రెండు గంటలకు పైగా సాహిత్య రాజకీయ విషయాలను చర్చించటం మరుపురాని అనుభూతి.

కాంతారావు ఆ తర్వాత విజయవాడ సిద్ధార్థ కాలేజిలో తెలుగు లెక్చరర్ అయ్యాడు. అయినా తరచుగా ఉయ్యూరు వచ్చి పలకరించి వెళ్ళేవాడు. ఆయన భార్య కమల, నా భార్య ప్రభావతి మంచి స్నేహితులు. కుటుంబ స్నేహం మాది. ఆయన ఆకస్మికమరణం జీర్ణించుకోలేక పోయాం. మంచి హాస్యాన్ని పండించేవాడు మాటల్లో. హృదయం చాలా మంచిది. కోపం క్షణికం. మంచి చెప్తే గ్రహించేవాడు. అందుకని ఉయ్యూరులో ఆయనతో మా సంబంధాన్ని పురస్కరించుకొని మాలో సాహితీ చైతన్యాన్ని కల్గించి ప్రేరణ కల్గించినందుకుగాను ఈ 'మహా కవితా వసంతం' పుస్తకాన్ని కాంతారావుకు అంకితం చేస్తున్నాం.

ఇంతవరకు కాంతారావుతో మా పరిచయం చెప్పాను. ఇక ఆయన జీవిత విశేషాలు తెలియజేస్తాను. దివిసీమలోని నాగాయలంక మండలం తలగడదీవిలో టి.ఎల్. కాంతారావు 1943లో జన్మించాడు. చిన్నప్పటి నుండి సాహిత్యాభిమాని. వేదపఠనంలాగ మహాప్రస్థానాన్ని నిత్యపారాయణం చేసేవాడు. మంచి మేధావి, లోతైన విమర్శకుడు. ఎవరూ చూడలేని విషయాలను కవిత్వంలో, రచనలలో చూసి, వాటిని వ్యాసాలుగా వ్రాసి ఆవిష్కరించి, ఆ రచయితల శేముషిని సాహితీలోకానికి చాటాడు. భారతి, ఆంధ్రప్రతిక, ఆంధ్రప్రభలలో ఎన్నో విలువైన సాహిత్య వ్యాసాలను రాశాడు. రేడియో ప్రసంగాలు చేశాడు. సంప్రదాయం, ఆధునికం అని గిరి గీసుకోలేదు. రచనలో గొప్పదనం వుంటే ఎవ్వరైన ఆయనకు ఆరాధ్యుడే. తిక్కన మీద ఎవరూ చేయనంత గొప్ప విశ్లేషణ చేశాడు. అభ్యుదయ రచనలపై ఆసక్తి మెండు. మొహమాటం లేదు, పదునైన విమర్శనాశైలి ఆయన సొత్తు. ఎందరో క్రొత్త యువకవుల కవిత్వాలను విశ్లేషించి, శ్లాఘించి, ప్రోత్సహించాడు 'క్రొత్త గొంతుకలు' పుస్తకంలో. ఆయన రావిశాస్త్రికి వీరాభిమాని .ఆయనపై రిసెర్చి చేస్తానని చాలా సార్లు అన్నాడు. తన రిసెర్చి ప్రణాళికను రాసి ప్రచురించాడు. రావిశాస్త్రి కథలపై 'రావిశాస్త్రి కథాప్రపంచం' పుస్తకం రాశాడు, సాహిత్యోపనిషత్తు, కవితాలోకనం, సాహిత్యంలో సంప్రదాయం – ప్రగతి యీయన యితర రచనలు. ఏ విషయంపైన అయినా కాంతారావు అభిప్రాయం ఏమిటి అని ఎదురు చూసేది సాహితీ లోకం. ప్రముఖ సాహితీ విమర్శకుడు చేకూరి రామారావు (చే.రా.) మెచ్చిన విమర్శకుడు కాంతారావు. ఆత్మీయత, అనురాగం, గాఢస్నేహం, నిర్మొహమాటం, మాట పదును, గుండె మెత్తన అన్నీ కలిస్తే కాంతారావు.






ఆయన రాసినవి చాలా వున్నాయి. ఆయన కుమార్తె, కుమారులు వీటిని కొన్ని యీ మధ్య సంపుటిగా ప్రచురించారు. ఇంకా చేయాల్సింది వుంది. తెలుగు విద్యార్థి సంపాదకులు కొల్లూరి కోటేశ్వరరావు ఆయన సహాధ్యాయి. తెలుగు విద్యార్థి పత్రిక బాధ్యతలను ఆయన కొంత కాలం నిర్వహించాడు. అర్.ఎస్.కె. మూర్తి, అద్దేపల్లి ఆయన గురువులు. గలగల మాటల ప్రవాహంతో, కవితా ఝుంఝుతో, విమర్శన శస్త్రాస్త్రాలతో అందర్నీ ఆకట్టుకునే మిత్రుడు కాంతారావు అకస్మాత్తుగా 5-3-1990లో మనందర్నీ విడిచి మరోలోకం చేరాడు. మహా ప్రస్థానం చేసాడు.

ఆయన అకాల మరణానికి చింతిస్తూ గుండె లోతుల్లోంచి పెల్లుబికిన కవిత 'మంచి మిత్రుని మృతికి స్మృతి గీతం' (ఏన్ ఎలిజి అన్‌ది డెత్ అఫ్ ఎ గుడ్ ఫ్రెండ్) వ్రాసి అక్షర బాష్పాంజలి ఘటించాను.

కాంతారావు రచనలు కాలాతీతాలు. ఆ సాహితీ మిత్రునికి, అభ్యుదయ వాదికి స్మృత్యంజలి ఘటిస్తూ ఈ 'మహా కవితా వసంతం' పుస్తకాన్ని నీరాజనంగా అంకితం ఇస్తున్నాము.



నాదము దివ్య వేదము, సునాద వినోదము సుస్వరామృతా
స్వాదము, సామగాన వరసాధనతో నవభావ కల్పనా
మోదము, స్వాదు చందన ప్రమోద సమీరము, మా తెలుంగు, స
మ్మోదము గూర్చు వీణియలు మ్రోగిన నాదము వాయులీనమున్.

– దూసి ధర్మారావు

**తెలుగులో మాట్లాడటం మన జన్మహక్కు**

# సరసభాషణం

- జోశ్యుల శ్యామలాదేవి

'సరసభారతి' అనే సాహిత్య సాంస్కృతిక సంస్థను ఉయ్యూరులో ప్రజలలో సాహిత్యంపట్ల అవగాహన పెంచటం, మహిళలు, యువకులు, విద్యార్థులకు భారతీయ సాహిత్యాన్ని, సంస్కృతిని అందుబాటులోకి తేవటం అనే ముఖ్యఉద్దేశ్యంతో ఏర్పాటు చేశాము. 24-11-2009న మొదటి సమావేశాన్ని శ్రీమతి సింగరాజు కళ్యాణి గారి సంగీత విభావరితో ఏర్పాటు చేశాం. ఆమెగాత్రం, పాట విశేషంగా ప్రభావితం చేసి, విజయవంతమైంది. విశేష స్పందన కల్గి, మంచి ఉత్సాహాన్నిచ్చింది. రెండవ సమావేశం 22-12-2009న శ్రీకృష్ణతత్వంపై జరిగింది. శతావధానశేఖర, భాషావారధి శ్రీ పాలపర్తి శ్యామలానందప్రసాద్ అద్భుత ప్రసంగంతో అలరించారు. చరిత్రభాస్కర స్వర్గీయ కోట వెంకటాచలం గారి కుమారులు, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, ఆయుర్వేదాలంకార బిరుదాంకితులు, బహుగ్రంథకర్త, పరిశోధకులు డా॥ కోట నిత్యానందశాస్త్రి గారిని ఆత్మీయంగా సత్కరించి తరించాము. 3వ సమావేశం 3-1-2010న శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాన్ని అతివైభవంగా జరిపి గురు ఋణం తీర్చుకున్నాము. శ్రీ ఆచంట రామమోహనరావు త్యాగయ్య జీవిత విశేషాలను అందించారు. శ్రీమతి జోశ్యుల శ్యామలా దేవి, శ్రీమతి ఎన్. విజయ, శ్రీ పి. గోపి బృందం త్యాగరాజ కీర్తనలను సమ్మోహనంగా పాడి సభారంజనం చేశారు. 'సరసభారతి' కార్యక్రమాలకు విశేష ఆదరణ లభించింది.

'సరసభారతి'ని విద్యార్థులకు చేరువ చేయాలన్న తపనతో 27-01-2010న నాల్గవ సమావేశాన్ని స్థానిక ఫ్లోరా విద్యాలయంలో నిర్వహించాం. వందేళ్ళ తెలుగు కథా ప్రస్థానాన్ని విద్యార్థులకు తెలియబరచాలని అవగాహన సదస్సు నిర్వహించాం. "చినుకు" మాసపత్రిక సంపాదకులు శ్రీ నండూరి రాజగోపాల్ ముఖ్య అతిథిగా వచ్చి విద్యార్థులకు తెలుగు కథా వైభవాన్ని, వారి హృదయాలకు హత్తుకునేట్లు ప్రసంగించి, మా ఉద్దేశ్యాన్ని సఫలం చేశారు. విద్యార్థులతో కథలు రాయించి చదివించాం. వారిలోని సృజనకు శ్రీ గోపాల్ ఆనందించి తగిన సూచనలు చేశారు. ఉపాధ్యక్షులు శ్రీజి. వేణుగోపాలరెడ్డి సభా సంచాలనం చేశారు. 21-2-2010 న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నాడు 5వ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథి సంగీత జ్ఞానేశ్వర, ఘంటసాల స్మారక అవార్డు గ్రహీత, రేడియో ప్రచారసారథి, ఆకాశవాణి విజయవాడ కేంద్ర సంచాలకులు మాన్యశ్రీ మంగళగిరి ఆదిత్యప్రసాద్ 'తెలుగుపాట పుట్టుక, పరిణామం' పై అనితర సాధ్యమైన ప్రసంగాన్ని అలవోకగా, కర్ణపేయంగా పాట మాటలతో శ్రోతలను మంత్ర ముగ్ధుల్ని చేశారు. శ్రోతలు ఆనందపరవశులై వారిని బహుధా ప్రశంసించారు. ఇలా 3 సంగీతకార్యక్రమాలు నిర్వహించగలిగాము అందరి ప్రోత్సాహ సహాయ సహకారాలతో.





6వ కార్యక్రమం 'శ్రీ వికృతి ఉగాది మహాకవి సమ్మేళనం' 14-3-2010న నిర్వహించాం. జిల్లా నలుమూలల నుండి 40 మందికి పైగా కవులు పాల్గొని వివిధ అంశాలపై సామాజిక స్పృహతో, వైవిధ్యభరితమైన అంశాలతో పద్యాలు, పాటలు, వచన కవితలతో విశేష రస స్ఫూర్తి కలిగించారు. స్వర్గీయ విద్వాన్ గబ్బిట మృత్యుంజయ శాస్త్రి గారు సుమారు 60 సంవత్సరాల క్రితం రాసిన పద్యాలు, వ్యాసాలను 'జ్యోతి స్సంశ్లేషణం' పేరుతో పుస్తకంగా ముద్రించి, ఆ రోజుననే ఆవిష్కరణ చేయించాం. మాజీ మంత్రివర్యులు శ్రీ మండలి బుద్ధ ప్రసాద్, శాసన మండలి సభ్యులు శ్రీ వై.వి.బి. రాజేంద్ర ప్రసాద్ గార్ల అమృత హస్తాల మీదుగా వైభవంగా జరిగింది. ఇద్దరు సాహితీ వేత్తలకు శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్‌గారి తల్లిదండ్రులపేర ఆత్మీయ సత్కారం చేశాం. ఆ సభలో పాల్గొన్నవారందరికి సరసభారతి ఉపాధ్యక్షులైన లయన్ శ్రీ కుటుంబరాజుగారు విందును ఏర్పాటు చేసి అందరి ప్రశంసలను అందుకున్నారు. ఈ వికృతి ఉగాది మహా కవి సమ్మేళనాన్ని ఆప్తమిత్రుడు, ప్రముఖ సాహితీ విమర్శకుడు స్వర్గీయ తలగడదీవి లక్ష్మీ కాంతారావు (టి.ఎల్.కాంతారావు) గారికి అంకితం చేశాం. సభావేదికను 'కాంతారావు వేదిక'గా ఏర్పాటు చేసి మిత్రఋణం తీర్చుకున్నాం. 'సరసభారతి' 7వ సమావేశం 24-3-10న శ్రీరామనవమి నాడు జరిపాం. శ్రీ మాదిరాజు శ్రీనివాస శర్మగారు శ్రీరామతత్వంపై ప్రసంగించారు. 13-4-10న 'అన్నమయ్య పదకవితా వైభవం'పై 8వ సభ జరిపాం. డా॥ తుమ్మల శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా విచ్చేసి అన్నమయ్య పదం, పాటలలోని విశేషాలను శ్రావ్యమైన కంఠంతో వినిపించి ముగ్ధుల్ని చేశారు. 18-5-10న శ్రీశంకరజయంతిని 9వ సమావేశంగా నిర్వహించాం. విద్యార్థులు శంకరస్తోత్రపఠనం చేశారు. బహుమతులిచ్చాం. శ్రీమతి మాదిరాజు శివలక్ష్మి శంకరుల జీవితం, రచనలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని చి॥ బిందు దత్త శ్రీ నిర్వహించగా శ్రీ మండా బాలాజి పర్యవేక్షించారు. చిన్నారులతో కార్యక్రమం చేయించాలన్న కోర్కె దీనివల్ల నెరవేరింది. 10వ సమావేశం శ్రీహనుమజ్జయంతి సందర్భంగా 5-6-10న జరిపాం. నాట్యావధాన సరస్వతి శ్రీ స్వర్ణ రాజహనుమంత రావు 'శ్రీమద్రామాయణంలో ఆంధ్రాయణం' పై సోదాహరణ ప్రసంగం చేశారు. 11వ సమావేశాన్ని 27-6-10న 'పురాణాలు కావ్యాలు-నేటిసమాజం" అన్నఅంశంపై నిర్వహించాం. ఆచార్య మడక సత్యనారాయణ, ప్రముఖ కథా రచయిత శ్రీ గంధం యాజ్ఞవల్క్యశర్మ, శ్రీమతి యడవల్లి మనోరమ, శ్రీమతి బెల్లంకొండ శివకుమారి, ప్రఖ్యాత కథా రచయిత శ్రీ గంధం వేంకాస్వామిశర్మ పై అంశంపై అద్భుతంగా మాట్లాడి దిశానిర్దేశం చేశారు.

## మహా కవిసమ్మేళనం ముచ్చట్లు

– మాదిరాజు శివలక్ష్మి

సరసభారతి సాహిత్య సాంస్కృతిక సంస్థ ఉయ్యూరు వారు తమ 6వసమావేశంగా శ్రీ వికృతి నామ సంవత్సర ఉగాది 'మహా కవి సమ్మేళనము' ఉయ్యూరు శాఖా గ్రంథాలయము నందు చాలా ఘనంగా ది.14-3-2010 ఆదివారంనాడు నిర్వహించారు. ఈ కార్యక్రమం రెండు భాగాలుగా జరిగింది.

మొదటగా ఉ॥ గం. 9.30 ని॥ నుండి గం. 10.30 ని॥ల వరకు జరిగిన కార్యక్రమంలో అతిథుల ఉగాది సందేశములు, పుస్తకావిష్కరణ, పురస్కార ప్రదానం వంటి అంశాలు చోటు చేసుకున్నాయి. ఈ కార్యక్రమానికి సరసభారతి అధ్యక్షులు శ్రీ గబ్బిట దుర్గా ప్రసాద్ స్వాగతం పలుకగా, సరసభారతి గౌరవాధ్యక్షులు శ్రీమతి జోశ్యుల శ్యామలాదేవి లక్ష్యప్రస్తావన చేశారు. దీనిలో భాగంగా గత సభలలో జరిగిన ఆయా అంశాలను తెలియజేస్తూ భవిష్యత్తులో సరసభారతి చేయబోవు కార్యక్రమాలు, లక్ష్యాలు తదితర అంశాలను శ్రీమతి శ్యామలాదేవి వివరించారు.

ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా మాజీ మంత్రివర్యులు, కృష్ణాజిల్లా రచయితల సంఘ గౌరవాధ్యక్షులు, తెలుగుభాషాభివృద్ధికి అనుక్షణం సేవలందిస్తున్న శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు విచ్చేశారు. ముఖ్య అతిథిగా శాసన మండలి సభ్యులు శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్ర ప్రసాద్‌గారు, గౌరవ అతిథిగా విజయవాడ ఆకాశవాణి స్టేషన్ డైరెక్టర్ శ్రీ మంగళగిరి ఆదిత్యప్రసాద్ గారు పాల్గొన్నారు. విజయవాడలోని మేరీస్ స్టెల్లా కాలేజీలో తెలుగు రీడర్‌గా ఉన్న డా॥ జి. రెజీనా, ఉయ్యూరు సిటికేబుల్ అధినేత శ్రీ తోట శివరామకృష్ణ ఆత్మీయ అతిథులుగా పాల్గొన్నారు. అనుకోని అతిథిగా తెలుగు భాషపై గల ప్రేమతో, అవ్యాజ అనురాగంతో విజయవాడ జాయింట్ కలెక్టర్ శ్రీ షంషీర్ అహ్మద్ ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈసభను ఉయ్యూరు సర్పంచ్ శ్రీ అంగడాల వెంకటేశ్వరరావు ప్రారంభించగా అధ్యక్ష బాధ్యతను కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు శ్రీగుత్తికొండ సుబ్బారావు చేపట్టారు.

శ్రీ బుద్ధప్రసాద్ రాష్ట్రంలో నెలకొన్న అశాంతికర వాతావరణం ప్రజలకు బాధను కలిగిస్తోందని ఆందోళన చెందారు. ఈసందర్భంగా తెలుగువాడిగా పుట్టడం గొప్ప అదృష్టమని, తెలుగు మాతృభాష నుండి మృతభాషగా మారితే మనం తెలుగు వారమని





24-07-2010న 12వ సమావేశంగా సరసభారతి మరియు ఎ.జి.అండ్ ఎస్.జి. సిద్ధార్థ డిగ్రీ కళాశాల సాంస్కృతిక విభాగం, తెలుగు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'కథా సదస్సు'ను నిర్వహించాము. శ్రీ యార్లగడ్డ రాజగోపాలరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా 'చినుకు' మాస పత్రిక సంపాదకులు శ్రీ నండూరి రాజగోపాల్, గౌరవ అతిథిగా కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు శ్రీ గుత్తికొండ సుబ్బారావు, ఆత్మీయ అతిథిగా అకాశవాణి ముఖ్య సంచాలకులు శ్రీ మంగళగిరి ఆదిత్య ప్రసాద్ విచ్చేసి, తెలుగు సాహిత్యంపై అభిరుచి పెంచుకోవాలని, అంతర్జాతీయంగా తెలుగు కథకు ప్రముఖ స్థానం వుందని కథలు జీవితంలోనుంచే వస్తాయని, మంచి కథలను చదివే అలవాటు మంచిదని విద్యార్థులకు హితవుచెప్పారు. జిల్లాలోని ప్రముఖ కథా రచయితలు శ్రీయుతులు సిహెచ్.వి. బృందావనరావు, మెరుగు రాధాకృష్ణమూర్తి, చలపాక ప్రకాష్, వేలూరి కౌండిన్య, దొండపాటి దేవదాసు, శ్రీమతులు కోపూరి పుష్పాదేవి, కోకా విమల కుమారి, జి. మేరి కృపాబాయి విచ్చేసి, తాము రాసిన కథలను వినిపించి ప్రేరణ కలిగించారు. కథా రచనలో విద్యార్థులకు పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేసాము. కాలేజి సెమినారు హాలులో జరిగిన ఈ సదస్సులో సాహిత్యాభిమానులు, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది రెండు వందలమందికి పైగా హాజరై స్ఫూర్తిని, ఉత్సాహాన్ని పొందారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీ బి.వి. రాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం దిగ్విజయంగా జరిగింది. అతిథులందరకు ఉపాహారం, మంచి విందును రాయుడు గారు ఏర్పాటు చేశారు. శ్రీ గబ్బిట దుర్గా ప్రసాద్ కథా సదస్సును సంచాలనం చేయగా శ్రీమతి జోశ్యుల శ్యామలాదేవి లక్ష్యాలను వివరించారు. తెలుగు అధ్యాపకులు శ్రీ ఎ.యల్. కాంతారావు, శ్రీ వేణు గోపాలరెడ్డి, శ్రీమతి మాదిరాజు శివలక్ష్మి సభానిర్వహణకు తోడ్పడ్డారు. 8 నెలలలో 12 సమావేశాలు నిర్వహించి సరసభారతి సాహిత్యాభిమానులకు చేరువయింది. సరసభారతి కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించటానికి సహకరించిన కార్యవర్గ సభ్యులకు, ముఖ్యంగా సీతంరాజు మల్లికాంబ, కోనేరు చంద్రశేఖరరావు, వి. బాల గంగాధరరావు, జి.వి. రమణ, జి.రామనాథబాబు, వేదాంతం మురళీకృష్ణలకు అభినందనలు. 'మహా కవితా వసంతం' పుస్తకాన్ని దోషరహితంగా డి.టి.పి. చేసిన వి.జి.షాపు నిర్వాహకులు, సరసభారతి ఉపాధ్యక్షులు శ్రీ గుంటక వేణుగోపాల రెడ్డికి, సహాయకులు మనోజ్ కుమార్, ఆంజనేయులు, జ్యోతిలకు కృతజ్ఞతలు. అందంగా ముద్రించిన శ్రీ రామా గ్రాఫిక్స్ వారికి అభినందనలు.

ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా విచ్చేసిన కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీ షంషీర్ అహ్మద్‌గారు ఎక్కడ తెలుగు భాషా కార్యక్రమాలు జరిగినా వాటిలో పాల్గొనడం తమకెంతో ఆనందంగా ఉందని, ఏ వ్యక్తయినా ముందుగా మాతృభాషను గౌరవించాలని తెలియజేస్తూ కవిత్వానికి ఓ చక్కని సామాజిక ప్రయోజనం ఉండాలని తెలుపుతూ ఉర్దూలో ఓ మంచి కవితను చెబుతూ తెలుగు అనువాదాన్ని కూడా వివరించారు.

ఈ కార్యక్రమానికి గౌరవ అతిధిగా విచ్చేసిన విజయవాడ ఆకాశవాణి స్టేషన్ డైరెక్టర్ శ్రీ మంగళగిరి ఆదిత్య ప్రసాద్ గారు సరసభారతితో తమకు గల అనుబంధాన్ని వివరించారు. నేటి సమాజానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతైనా అవసరమని తెలియజేశారు. 'ఘనమౌ వత్సర మిట్టి శ్రీ వికృతి సౌఖ్య ప్రాప్తికి' అంటూ ఈ శ్రీ వికృతి నామ సంవత్సరం అందరికీ శుభాలను, సౌఖ్యాలను కలుగజేస్తుందని తమ పద్యం ద్వారా ఆకాంక్షిస్తూ చక్కని శైలిలో పద్యం పలికించి సభను అలరించారు ఇంకా అనేక పాటల రాగాలాపనలు చేసి, వాటి విశేషాలను తెలియజేస్తూ తక్కువ సమయంలో ఎక్కువ జ్ఞానం అందే విధంగా సామాన్యుడికి సైతం సంగీతం అంటే ఏమిటో అర్థమయ్యేలా తమదైన శైలిలో వివరించారు. అదే రోజు సాయంత్రం భీమవరంలో 'ఘంటసాలగాన ప్రవక్త' అనే బిరుదును అందుకోబోతున్న శ్రీ ఆదిత్యప్రసాద్ గారికి సభలోని వారంతా తమ కరతాళ ధ్వనులతో ఆభినందనలను, ఆనందాన్ని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు శ్రీ బుద్ధప్రసాద్‌గారు, శాసనమండలి సభ్యులు శ్రీ వై.వి.బి. రాజేంద్ర ప్రసాద్ గారిచేతుల మీదుగా శ్రీ గబ్బిట దుర్గా ప్రసాద్ గారి తండ్రి గారైన కీ॥శే॥ విద్వాన్ గబ్బిట మృత్యుంజయశాస్త్రి గారు రచించిన "జ్యోతి స్సంశ్లేషణం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా 'గబ్బిట భవానమ్మ మృత్యుంజయ శాస్త్రి గారల స్మారక పురస్కా'రాన్ని ఇద్దరు సాహితీ వేత్తలకు అందజేశారు. వీరిలో ఒకరు ఉయ్యూరు ప్రాంతంలో గతంలో చాలా సంవత్సరాలు జరిగిన సాహితీ కార్యక్రమాలలో పాలుపంచుకొంటూ, వృత్తిరీత్యా ఇప్పుడు కైకలూరులో నివసిస్తున్న తెలుగు పండితులు శ్రీపీసపాటి కోటేశ్వరరావు గారు, మరొకరు విభిన్న అంశాలలో సామాజిక స్పృహ కలిగే విధంగా రచనలు చేస్తున్న రచయిత్రి శ్రీమతి భమిడిపాటి బాలా త్రిపుర సుందరీ దేవి గారు. ఈ కార్యక్రమానికి సరసభారతి అధ్యక్షులు శ్రీగబ్బిట దుర్గా ప్రసాద్ గారు ఆహ్వానం పలుకగా, కృష్ణాజిల్లా





చెప్పుకొనే అర్హతను కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. మహా కవి సమ్మేళనాన్ని ఉద్దేశిస్తూ కవి యొక్క ఆకాంక్ష తెలుగుజాతికి 'శ్రీరామ రక్ష' అనీ, ఇంతమంది కవులు మన భాషను ప్రేమిస్తూ, దాని విశిష్టతను ముందు తరాలకు అందిస్తే మన వారసత్వాన్ని మనం కాపాడుకొన్న వారమవుతామని పేర్కొన్నారు. ఇంతటి కార్యక్రమాన్ని ఇంత వయస్సులో కూడా నవ యువకుడివలె తన భుజ స్కంధాపై వేసుకొని ఈ సాహితీ కార్యక్రమాలను ఒంటి చేత్తో సకుటుంబంగా నడుపుతున్న శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్ గారిని అభినందించారు.

శాసన మండలి సభ్యులు శ్రీ వై.వి.బి. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నూతన తెలుగు సంవత్సరాది సందర్భంగా 'సరసభారతి' వారు ఈవిధమైన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందని, నేటి సమాజానికి ఇలాంటి కార్యక్రమాలు అవసరమని పేర్కొన్నారు. తెలుగు భాష కన్నతల్లి వంటిదని, ఇంగ్లీష్ భాషా వ్యామోహాన్ని విడనాడాలని, పరభాష కోసమని పిల్లల్ని అవమానించడం చాలా బాధాకరమని, సమకాలీన పరిస్థితులను ప్రస్తావిస్తూ తెలియజేశారు. తెలుగుజాతి మొత్తం ఎప్పటికీ ఐక్యంగానే ఉండాలనీ, ఉంటుందనీ ఆశాభావం వ్యక్తం చేశారు. తమ గురువులైన శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్ గారు సకుటుంబంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. దుర్గాప్రసాద్ మాస్టారితో తమకున్న అనుబంధాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఆ మధురానుభూతుల్ని తెలుపుతూ తన్మయత్వానికి లోనయ్యారు. ఈగ్రంథాలయానికి మాస్టారి కృషిని తెలియజేస్తూ ఈ గ్రంథాలయం పైన మరొక అంతస్థు వేస్తే అది 'టౌన్‌హాల్' గా ఉపయోగించు కోవడానికి బాగుంటుందని, అందుకు అవసరమైన అన్ని రకాల నిధులు గురించి స్థానిక అధికారులు ప్రభుత్వ దృష్టికి తేవాలని కోరారు.

ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన డా॥ జి. రెజీనా మాట్లాడుతూ పల్లెటూళ్ళు పచ్చదనం గురించి తెలియని నేటిరోజుల్లో ఇలాంటి కార్యక్రమాలు మన సంస్కృతీ సంప్రదాయాలను చాటి చెబుతాయని అంటూ "పల్లెటూళ్ళు మన భాగ్యసీమరా" అంటూ చక్కని కవితను వినిపించారు. ఉయ్యూరు సిటి కేబుల్ అధినేత శ్రీ తోట శివరామకృష్ణ మాట్లాడుతూ మన మాతృభాషా మాధుర్యాన్ని తెలియజేసే ఇలాంటి కార్యక్రమాలను ప్రజలకు అందించడానికి తమ వంతు కృషిని తప్పక అందిస్తామని తెలియజేశారు.

"అక్షరం లోకరక్షకం"

# సరసభారతి

సాహిత్య సాంస్కృతిక సంస్థ - ఉయ్యూరు

## సరసభారతి కార్యవర్గము

| | | |
|---|---|---|
| గౌరవాధ్యక్షులు | – | శ్రీమతి జోశ్యుల శ్యామలాదేవి |
| అధ్యక్షులు | – | శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్ |
| ఉపాధ్యక్షులు | – | లయన్ శ్రీ చిందా వీర వెంకట కుటుంబరాజు |
| | | శ్రీ గుంటక వేణుగోపాలరెడ్డి |
| | | డా॥ దీవి చిన్మయ |
| కార్యదర్శి | – | శ్రీమతి మాదిరాజు శివలక్ష్మి |
| సహాయ కార్యదర్శి | – | శ్రీ మండా వెంకట జయకృష్ణ బాలాజి |
| కోశాధికారి | – | శ్రీ గబ్బిట వెంకట రమణ |
| కార్యవర్గ సభ్యులు | – | శ్రీమతి సీతంరాజు మల్లికాంబ |
| | | శ్రీ కోనేరు చంద్రశేఖర రావు |
| | | శ్రీ బళ్ళ సూర్యనారాయణ |
| | | శ్రీ గబ్బిట రామనాథ బాబు |
| | | శ్రీ పువ్వాడ చంద్రమౌళి |
| | | శ్రీ షేక్ ఖలీల్ |

ప్రచార సాంకేతిక కార్యదర్శి–శ్రీ వీరమాచనేని బాలగంగాధర రావు





రచయితల సంఘం అధ్యక్షులు శ్రీ గుత్తికొండ సుబ్బారావుగారు సభాధ్యక్ష బాధ్యతను చాలా చక్కగా సమయపాలన పాటిస్తూ నిర్వహించారు. సరసభారతి కార్యదర్శి శ్రీమతి మాదిరాజు శివలక్ష్మి ప్రతి అంశాన్ని స్పృశిస్తూ, అతిథులందరినీ పేరు పేరున వివరిస్తూ వందన సమర్పణ చేశారు.

ఈ కార్యక్రమంలో రెండవ ఘట్టంగా 'ఉగాది మహా కవి సమ్మేళనం' జరిగింది. దీనికి డా॥ గుమ్మా సాంబశివరావు అధ్యక్షత వహించగా, శ్రీ వేదాంతం శరశ్చంద్ర బాబు, శ్రీ పెదప్రోలు విజయ సారథి, శ్రీ వేలూరి కౌండిన్యలు నిర్వహించారు. ఈ ఉగాది మహా కవి సమ్మేళనంలో జిల్లాలోని నలుమూలల నుండి దాదాపు 40 మందికి పైగా కవులు పాల్గొన్నారు. వీరు వివిధ కోణాలలో సామాజిక అంశాలను ప్రస్తావిస్తూ ముఖ్యంగా తెలుగు జాతి అంతా ఒక్కటే అని ఏకీభావాన్ని వ్యక్తంచేశారు.

ఈ కార్యక్రమంలో 12 ఏళ్ళ చిన్నారి చి॥ మాదిరాజు బిందు వెంకట దత్తశ్రీ మావంటి చిన్నారులకు కూడా ఇలాంటి కార్యక్రమం ఒకటి ఏర్పాటుచేయాలని ఆకాంక్షను తన కవిత ద్వారా తెలియజేయగా, వెంటనే స్పందించిన సరసభారతి అధ్యక్షులు దుర్గా ప్రసాద్ గారు కేవలం పిల్లలకు ఒక సభను నిర్వహిస్తామని సభాపూర్వకంగా తెలియజేశారు. అనంతరం ఈ కార్యక్రమానికి విచ్చేసిన వారందరికీ ప్రస్తుత లయన్స్ క్లబ్ అధ్యక్షులు, సరసభారతి ఉపాధ్యక్షులు శ్రీ చిందా వీర వెంకట కుటుంబరాజు చక్కని విందును అందజేశారు.

ఉయ్యూరులో పూర్వం ఎన్నడూ జరగనంత వైభవోపేతంగా కార్యక్రమం జరిగి, హృదయాలపై చెరగని ముద్రవేసింది. తీయని భావనలు మనసును ఆహ్లాదపరిచాయి. సుమారు 20 మంది కవయిత్రులు పాల్గొని తమ కవితాసత్తాను చూపి ప్రశంసలనందుకోవటం ఒక విశేషం. అతిథులకు, మహా కవి సమ్మేళనంలో పాల్గొన్న కవిమిత్రులకు, కార్యవర్గ సభ్యులకు 'సరసభారతి' జ్ఞాపికలను అందజేసింది. కార్యకర్తల తోడ్పాటు, సాహిత్యాభిమానుల సహకారం, రసజ్ఞులైన ప్రేక్షకులవల్ల ఈకార్యక్రమం విజయాన్ని సాధించింది. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించటానికి మార్గం సుగమం అయింది. 'అక్షరం లోకరక్షకం' అన్న సరసభారతి అకాంక్ష నెరవేరటానికి దోహదమయింది. "ఎందరో మహానుభావులు అందరికి వందనాలు".

## భ్రష్ట స్వామ్యము

కోడూరు శ్రీపాండురంగారావు
మచిలీపట్నం.

దేశ మదియును దెలుగైన, తెలుగు మాట
పలుక దోషంబు, శిక్షింత్రు బడులలోన
పాలకు లవీర్యులైనప్డు పట్టు నిట్టి
గతియు, జాతి దౌర్భాగ్యమ్ము కాదె తెలియ.

దుక్కి దున్నంగ నీరేమొ చుక్కలేదు
విత్తుదామన్న దొరుకవు విత్తనాలు
వడ్డి పెరిగిన అప్పులు నడ్డివిరుచు
అహహా నీభాగ్యమేమోయి అన్నదాత.

ఎరువు లెరువు లందురుగాని దొరుకునేమి?
పురుగు మందు తిని బలిసెపురుగు లన్ని
ఏటికేడాది రైతులు పాటుపడగ
పంట గిట్టుబాటు ధరయు బలుకదయ్యె.

నీరు గాలి వెలుగు నిత్యావసరములు
కడకు దేనినెన్న కలితి కలితి
సరుకు లన్ని కలితి సర్కారు సభ కల్తి
కలితి కానిదేది కలదు యిపుడు!

రైతు కోర్కెలు దీర్పంగ నేతలెపుడు
మీన మేషాలు లెక్కించు మిన్నుజూచు
తిండిగింజలు కరువైన దిక్కులేదు
ఆత్మహత్యయె మార్గమా యతని కిపుడు.

ఎన్నికోట్లవి ఖర్చైన నేది ఫలము
చట్ట సభలందు కొట్లాట చాల సలిపి
వీరు వారును తయ్యారు విందు గుడువ
ప్రజల గోడ దెవ్వరికిని పట్టదయ్యె.





మెల్ల మెల్లగ నెగబ్రాకి మిన్ను దాకె
ధరలు వింధ్యాద్రి పగిది; నీ దారుణంబు
నడ్డలే దగస్త్యుండును; నరయ ప్రజల
రాజ్యమా? యిది వట్టి యరాచకమ్ము.

కల్లు మానుడో యన్నది కాదు, నేడు
కల్లు మానకుడో యన్న గట్టి మాట
పరగ నాదరమ్మె నిల్చె ప్రభుత కకట
ప్రజట గోడేమి వారికి పట్టదయ్యె.

పబ్బు సంస్కృతి మిక్కిలి ప్రబలి పోయె
స్లీవు లెస్సుగ  జాకెట్లు జీబు జుట్టు
ఎత్తు మడమల చెప్పులు నిరుకు పాంట్లు
నేటి యువతుల పాట్లివి నిజము సుమ్ము.

అమ్మనాన్న యనెడి కమ్మదనమ్మది
కరువునయ్యె నేడు ఖర్మమిదియు
మమ్మి డాడి యనెడి మాటలే పల్కును
పాపలైన పెద్దవారలైన.

అర్థరాత్రంబు నందున నగనేల
పట్టపగలైన తిరుగాడ పడతి వెరచు
ప్రజల స్వామ్యమ్ము వర్థిల్లు నిజము నిట్లు
కడుపు జించిన బడుగాదె కాళ్ళపైన.

ఆశయా బద్ధతే లోక మనిన యట్లు
మంచి రోజులు ముందుండె మనకు ననుచు
బ్రతుకు నిత్య నిరీక్షణామతులమైతి
మక్కటా లేదు నిష్కృతి యన్న మాట.

నేను – దేశమ్ము బానిసయైన యపుడు
సర్వస్వాతంత్ర్య భావనా స్వామ్యుడైతి
దాస్య శృంఖలల్ విడిన తత్క్షణంబ
కోలుపోయితి స్వేచ్ఛను ఘోర రీతి.

## వికృతి స్వాగతం

డా॥ గుమ్మా సాంబశివరావు,
విజయవాడ

ఓ వికృతీ రా ! వికృతంగా రాకు
సుకృతంగా రా!
నీరాక సుకృత మేననిపిస్తున్నది
నువ్వు వస్తూనే మహిళా బిల్లుపై
ఆశలు రేకెత్తించావు
నీరాక శుభ సూచకమని భావిస్తా.

గుబురుమామిడి కొమ్మమీద
కొలువు దీరిన కోకిలమ్మ
కొత్త పాతల కబురులన్నీ
కొసరి కొసరి వినిపిస్తున్నది.

స్వార్థం పిశాచాన్ని తరమమంటున్నది
వేర్పాటు ఇక్కట్లకు మార్గాలంటున్నది
మాత్సర్యపు మంటలనార్పి
మమతల మల్లెల్ని పూయించమంటున్నది
మానవతా పరిమళాన్ని
మహిమీద నింపమంటున్నది
సాత్రాత్ర సుగంధాన్ని సర్వ జగతికి
పంచమంటున్నది.

కోరికల కొండల్ని కూల్చమంటున్నది
పరోపకారపు పంటకాలువల్ని
ప్రవహింప జేయు మంటున్నది
ఆరురుచుల్ని ఆరగించినట్లే
అరిషడ్వర్గాన్ని అణచమంటున్నది.





## నేటి ఘోరాలు

పి. పుష్పలీల, మచిలీపట్నం

పల్లవి :-
మనిషివైన – ఓ మనిషీ!
మహనీయుడవైన – నీవు
మృగమైనది – ఎందులకు!
ధనమా ! ధనదాహమా !
లోభమా! ప్రలోభమా! ॥మ॥

చరరణములు :-

1.
హృదయమెంతొ – మెత్తనిది
దయాప్రేమ – నిండినది
కరుణ నిండిన – కలశములో
విషపూరిత – మైనదేల!
వ్యసనమా ! – వ్యామోహమా ! ॥మ॥

2.
మనిషి జన్మకంటె –మధురం
ఏ జన్మకు – లేనే లేదు
పరమాత్ముడు – నివసించే
ఆలయమే – నీ హృదయం!
పాడుచేయకు – ఆలయము ॥మ॥

3.
అహము – అణచి వేయునులే
ఇహము – ముంచి వేయునులే
పేరాశల – ప్రబోధనూ!
లోకాశల – వికాసమా!
ఏది నిను – బంధించినదీ? ॥మ॥

4.
వంచనతొ – బ్రతుకంత
మోసాలె – వేషాలై
పల్లకిలొ – ఊరేగే
స్వార్థం – నీ ఆయుధమై,
వేటాడుట – న్యాయమా ! ॥మ॥

5.
కాలమెంతొ– భీకరమై
కబళించే – సునామీలై
శాంతిలేక – కన్నీరేగా!
చిత్రమైన – వికృతిలో
ప్రకృతిగా – మారేదెపుడు? ॥మ॥

మాయ స్వాముల తంత్రాల్ని
మటుమాయం చేయమంటున్నది
ఆధ్యాత్మికత బోధిస్తూ
అష్ట భోగాలతో తులతూగవద్దంటున్నది.

రెక్కలు ముక్కలు చేసుకొని
తెచ్చిన ఆహారాన్ని
ఆరగించిన చిన్నపిట్టలు
రెక్కలొచ్చి ఎగిరిపోయినప్పుడు
ముసలి పిట్టల రోదన
వినమంటున్నది.

ఓ వికృతీ నీ పదసవ్వడులు
సంతోషపు నాదాలను వినిపించాలి
సర్వజగతికి శుభాలను కలిగించాలి.

సీ॥ ఫాల భాగమునందు బాగుగా వెలుగొందు
చిరుబొట్టు కాంతితో చెలగుచుండు
అంశమ్ము లేవైన అద్భుతరీతిలో
వాగ్ఝరిన్ ప్రవహించు వక్త యితడు
వయసెంతొ తెలియదు వడివడి తిరుగుచు
ఉత్సాహమును జూపు యువకుడితడు
సాహిత్య సభలన్న సరియైన సమయాన
సాక్షాత్కరించెడి సరసుడితడు

తే॥ ప్రథిత గబ్బిట వంశాబ్ధిరాజితుండు
సరసభారతి సంస్థకు స్థాపకుండు
ఇతడె దుర్గాప్రసాదు సాహిత్యజీవి
వీరి కగుగాక శుభములు వేనవేలు !





## రెండు వేల 'తొమ్మిది'

చలపాక ప్రకాష్
విజయవాడ.

తొమ్మిదవ అంకె మనస్సుని
తొమ్మిది ముక్కలుగా తురిమేసింది!

అవును!
తొణకని, బెణకని
మహానాయకుణ్ని సైతం
మింగేసిందీ తొమ్మిది!
నా నగరాన్ని క'న్నీళ్ళ' మధ్య ముంచేసి
తొమ్మిదుగుర్ని తొమ్మిదిచోట్ల
తరిమేసిందీ తొమ్మిది॥

తేటతేట తెనుగు తుట్టెని తుంపేసి
తెగలు తెగలుగా తేళ్ళబారిన పడేసి
చీలిక కొండెలతో కందిపప్పు బద్దల్లా
దొలిచేసిందీ తొమ్మిదే!!!

తెగులు పట్టిన పగలతో
తెలుగోడి గుండెల్ని రెండుగా చీల్చేసి
భోగిమంటలకు బలిచ్చే ప్రయత్నం చేసిందీ
తొమ్మిదే!
అక్షరానికీ కక్ష నేర్పించేసి
సినీ రంగుల్నీ రెండు కళ్ళుగా వేరుచేసిందీ
తొమ్మిదే!!!

నేలకోసం, హాయిగా బ్రతుకుతెరువు కోసం కాక
శ్మశానంలో ఆరడుగుల సమాధి కోసం
పేట్రేగేలా చేసిందీ తొమ్మిదే!

అయితే
ఇన్ని నష్టాలకు కారణమైన ఈ తొమ్మిది
అన్ని పార్టీ రంగుల్నీ 'ఐక్య' పరిచిన ఘనతను కలిగించిందీ
తొమ్మిదే!!
తొమ్మిదో మెట్టు నుండి పదో పదోన్నతి కల్పించేందుకు
వీడ్కోలు పల్కిన ఈ తొమ్మిది....
కష్టాలను తోడ్కొనిపోతూ
ఆనందాల పరవళ్ళకు ఆశలు కల్పించు దిశలో
పరిగెత్తి పోయిందీ తొమ్మిది !!!

చి॥ మాదిరాజు బిందు దత్త శ్రీ
ఉయ్యూరు.

## విజ్ఞప్తి

గంగను భగీథుడు భూమిపైకి తీసుకురావడమేమోగాని!
జ్ఞానగంగను సరసభారతి ద్వారా మన ముందుకు తీసుకువచ్చారు
శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్ గారు. అందుకే
జ్ఞాన గంగ మన సరసభారతి
ముత్యాల హారం సరసభారతి
పగడాల మూట సరసభారతి
అంగళ్ళలో రతనాలు అమ్మినారట ఒకప్పుడు అది ఏమోగాని
సరసభారతి సన్నిధిలో
రత్నాలు, వజ్రవైఢూర్యాలు, మణిమాణిక్యాలు కూడ దొరుకుతాయి
ఇక్కడ కూడుకున్న మీరంతా
యోగులు, జ్ఞానులు, సజ్జనులు, యక్ష, కిన్నెర, కింపురుషులు
మేమూ పిల్లలం దైవాంశ సంభూతులం
నిష్కల్మష హృదయులం, భావిభారత పౌరులం
అంతేకాదు
సరసభారతికి వారసులం
అందుకే విజ్ఞప్తి చేస్తున్నా
సరస భారతిలో మా బాలల కోసం
అద్భుత కార్యక్రమం ఒకటి జరగాలని.





## అందరాని రహస్యం

గంధం వేంకాస్వామి శర్మ
విజయవాడ.

ఇంత సృష్టి నెటు జరపెను
ఎవ్వండీ సృష్టికర్త?
ఎవరు నేర్పిరీ విద్యను?
రోదసి నెట్టుల జేసెను?
నీలిరంగు నెట్లు వేసెను?
ఆధారమ్ములేని చోట
ఎటులతికెను ఈ నీలిమ?

సూర్యుడేమి? చంద్రుడేమి?
ఈ ఇరువురి ధర్మమేమి?
అగ్ని నొకడు వర్షించును
హాయి నొకడు కురిపించును.

గ్రహముల నెట్టుల మలచెను
కక్ష్య లెట్లు ఏర్పరచెను
కక్ష్యలలో పయనించెడు
శక్తి నెట్లు చేకూర్చెను?

వాయువేమి? వర్షమేమి?
మేఘమ్ముల నణగియుండు
నీరమ్ముల మర్మమేమి?

ఆటులేమి? పోటులేమి?
ఆ సంద్రపు ఘోష యేమిటి?
నురుగుల గ్రక్కుచు పరిగిడు
ఆ అలల ధర్మమేమి?
పోటులేమి? చెలికట్టను దాటిరాని
ఆ అర్ణవ సొగసదేమి?

జలధిలోన మంటలేమి?
ఆ జ్వాలల నదుపుచేయ
నా నీటికి చేతగాద?
ధర్మమిచట దగ్ధమౌట
ప్రకృతి వికృతి యగుటేనా?
మానవు లిట్లగుదురంచు
ముందే చెప్పుట యౌనా?
ఎవ్వండీ సృష్టి కర్త
ఎవ్వరు నేర్పిరీ విద్యను?
అలసుల యో ఈ కన్నులు
నలుసులనే చూడలేవు
సృష్టి మూలముల నెట్టులు
చూడనౌను ఈకన్నుల?
సర్వంబును సృష్టిజేయు
సర్వేశా పరమేశా!
జ్ఞాన చక్షువుల నిచ్చియు
చూపంగదె నీరూపము?

ఎవ్వనిచే జనించు జగమెవ్వని
యందున నుండు లీనమై
ఎవ్వని యందు డిందు
పరమేశ్వరు డెవ్వడు?
మూలకారణం బెవ్వడు?
వాని నాత్మభవు నాతని నే శరణంబు
వేడెదన్-
జ్యోతి స్వరూపాయ
యోగీంద్ర వంద్యాయ
జయమంగళం
నిత్య శుభమంగళం

## కోకిలమ్మ వ్యథ

ముదిగొండ సీతారామమ్మ
మచిలీపట్నం

ఉ॥ ఏమది కోకిలమ్మ కనులింతయు చేసుకు చూచుచుంటివీ
ఆమనిలోన తియ్యనగు ఐక్యత గూర్చెడి పాట పాడగన్
వేమరు కోరుచుంటిమన వింతలు చేయుచు కానరావు నీ
వేమని తల్చుచుంటివి, యికేమగునో నవవత్సరాదియున్
"బదులీయని పక్షిని గూర్చి యిలా తలపోశాను"

ఉ॥ రాయలసీమయేయగును రత్నపుసీమని తల్చి యేగెదో
తీయని పల్కులన్ చిలుకు తీరని నాస జనాళి మెచ్చెదో
హాయని తల్చి యేగెదవొ ఆ తెలగానము మీద ప్రేముడిన్
ఓయని పిల్చినన్ పలుకుమో సఖి పాటలపేటికీవెగా!

చం॥ తెలుగు ఉగాది వచ్చినది తీరుగ పాటలు పాడవేమిటే
కలుగునుహాయి మాకు నవకావ్యములల్లెడి శక్తికల్గునీ
వలుకను మాని మానసము లైక్యము చేసెడి తేటగీతికల్
పలుకుము కోకిలా యనగ భావము చాటెను కంటి బాసతో

సీ॥ బోరు బావులలోన బుడతలు పడిపోవ
అలమటించెడి తల్లి ఆర్తి చూచి
ఆకాశమంటెడి అలలుగా పొంగుచు
ధర్మమ్ము తప్పిన ధరల చూచి
ఒక వంక నిరసనల్ ఒక వంక ఉద్యమాల్
అల్లకల్లోలమౌ ఆంధ్ర చూచి
వెతలకు క్రుంగుచు వెసులుబాటును లేక
ఆత్మహత్యల ప్రజలాత్మ చూచి

ఆ.వె॥ మదికి పాటరాక మౌనమ్మునందితి
ఎటకు యేగలేక గుటకమ్రింగి
నిల్చియుంటినిట్లు నిశ్చలతను నేర్వ
చేదుమిగిలె మదికి మోదమేది?

తే.గీ॥ కొత్తదీ ఉగాదంచును కోరి పిలువ
మాట పాటలు మరచితి మాన్య సుకవి
పాడలేనయ మధురమౌ పాటలిపుడు
అనెడి భావమ్ము కనుపించ నదిరి పడితి.





## శిశిరం ముసుగులో

వేదాంతం శరశ్చంద్ర బాబు
విజయవాడ.

పాతసంవత్సరం ఏడిపించి ఏడిపించి వెళ్ళిపోయింది
కొత్తసంవత్సరం ఆశల వెలుగు జిలుగులతో
బంగారు వన్నె ఊహలతో ఊరిస్తూ వస్తోంది!
కాలం సృష్టి స్థితి లయాలకు మూలం
కాలం కంటికి కనిపించని ఇంద్రజాలం
మానవ మేధస్సుకు తగులుకున్న
క్వశ్చన్ మార్కు గాలం! కాలం!

పువ్వుల్ని పిండిన అత్తరువులలో మునిగి తేలే వాడికి
సహజ నిర్మలనమై కుసుమ సౌందర్యం సౌగంధ్యం అక్కరలేదు.

ఫైళ్ళతోనూ జీతం రాళ్ళతోనూ
జీవితం ముడి పెట్టుకున్నవాడికి
శిశిరమే కాని, వసంతం కాదు
పూటకూలికి చెమట ధారపోసే వాడికి
కాపుసారా నిషాయే కానీ కమ్మ తెమ్మెర ఖుషీ లేదు
సామాన్య మానవుడికి సంసారాన్ని మించిన ప్రపంచంలేదు
కోటి కోటి సమస్యలతో సమరమే కాని
కోయిల పాటలు వినిపించుకొనే తీరికేలేదు

తన చుట్టూ తాను తెరలు దించుకొని
ఆకలిని ఆవేదనని తప్ప త్రాగి
జీవితపు చీకటి గదిలో
కలల మైకంలో పడి ఉన్న
మానవుణ్ణి చూసి
నిండుగా పూసిన గున్నమామిడి నిట్టూర్చి తలదించుకుంది.

నిలువెల్ల పూచిన మల్లెతీగ
మంచు బొట్లు కన్నీరుగా విడిచింది
రసాల కిసలయాలు నిరసించి
కోకిల నాద గీతాన్ని ఎలుగెత్తి పాడింది.

మోదుగు తన ఎర్రని గుండెల్ని విచ్చుకొని సానుభూతి ప్రకటించింది
ఎవరికీ పట్టని వెర్రి మోహం వసంతం
పువ్వుపువ్వునూ చూచి జాలిగా నవ్వుకుంది
ఉగాది హుటాహుటిన వచ్చేసింది
అయినా మనిషి యింకా శిశిరం ముసుగులోనే నిద్రిస్తున్నాడు.

**షాజహాన్**

కొట్టి రామారావు
మచిలీపట్నం

ముంతాజ్‌మహల్లో / తాజ్ మహల్‌ని చూస్తున్నాడు.

తాజ్‌మహల్లో / ముంతాజ్ మహల్‌ని చూస్తున్నాడు.

**రెక్కలు**

తాత్విక వస్తువుకి రెక్కలు తొడిగిన రూప నిర్మాణం – రెక్కలు ఈ రూపంలో 4 పాదాలు – 2 పాదాలు 2 భాగాలుగా విభజింపబడి ఉంటాయి.

పై 4 పాదాలు పక్షి శరీరమైతే, క్రింది 2 పాదాలు పక్షి రెక్కలవుతాయి.

పై 4 పాదాలు ఒక జీవితానుభవాన్ని గూర్చి చెబితే, చివరి రెండు పాదాలు ఆ అనుభవం ద్వారా కవి చెప్పదలచిన తత్త్వం గూర్చి చెప్తాయి. **(యమ్.కె సుగమ్ బాబు)**

ఉదా : పూలచెట్టుకైనా / వింతవేదన? / వేదనాజనితం
తొలిపువ్వు / పూచేవేళ / సృజన

1. నేను చెప్పేది ఒక్కటే నిజం
బ్రతుకంతా అబద్ధం!
నిజానికి భయం లేదు
2. అమ్మలంతా ఒక్కటే కాదు
అలనాటి, నేటి అమ్మల్లో ఎంతో తేడా
కష్టంలో త్యాగశీలతలో!
3. శరీరానికే వయసు
మనసుకు కాదు
మనస్సూ ఒక భ్రమే!
4. ఆలోచన కావాలి విశ్వవ్యాప్తం
మూలాల్ని విస్మరించకు
నిలబడ్డాక కదా పైకిచూడటం!
5. నిన్ను నువ్వు దర్శించు
ఆతర్వాతే భగవంతుడు
ఆత్మసాక్షాత్కారం భగవద్దర్శనమే
6. హరివిల్లుకు సప్తవర్ణాలే
రాజకీయానికి ఎన్నిరంగులో!
రంగులు మార్చడమే రాజకీయమా?
7. సత్యానికన్న అసత్యానికే
ఎక్కువ బలం, మంచీ చెడ్డా అంతే
మంచి కన్న చెడ్డనే నమ్మబుద్ధి!
8. నువ్వు సంధించిన అపవాదు నిజం
నీ మీద పడ్డ ప్రతినింద అబద్ధం
నీ అపవాదుకన్న నీమీద పడ్డ నిందే నమ్మబుద్ధి!





9. జరగడానికి వీలులేని చోట జరిగిందన్నా
చెయ్యలేనివాడు చేశాడన్నా నమ్మాలనిపిస్తుంది
సత్యానికన్న అసత్యానికే బలమెక్కువ!
10. ఆనందం అంటే ఏమిటి?
దేనికోసం బ్రతకడం?
బ్రతకడమే ఆనందం!
11. దీపం కొడిగట్టింది కొడిరాలిస్తే దీపం ప్రకాశవంతం
"కొడిరాల్చు దీపం ప్రకాశిస్తుంది" "అదినాపని కాదు"
కొడి రాల్చడం దీపం పని!
12. కష్టాలు మనుషుల్ని కలుపుతాయ్
సుఖాలు మనసుల్ని మరుగుపరుస్తై
మనుషులూ మనసులూ ఒకటికాదు
13. ఆనందం గుండెజబ్బుని రానీయదు
హాస్యం ఆనందాన్నిస్తుంది
హాస్యం ఆనందం మీకు సుస్వాగతం!
14. సిద్ధాంత సృష్టి మానసిక చేష్ట
సిద్ధాంతానికి అందనిదే జీవితం
ఏ సిద్ధాంతమూ సమగ్రం కాదు!
15. నేటి స్త్రీ మారుతోంది
తగ్గట్టుగా పురుషుడు మారడంలేదు
అందుకే ఘర్షణ స్త్రీ పురుషుల మధ్య
16. మన తప్పు పని ఒక ఆదర్శం
అదే యితరులు చేస్తే తప్పు
తప్పుకు తొడుగు ఆదర్శం !

## ఆవేదన

జి. మేరీ కృపాబాయి
మచిలీపట్నం

భూమిలోపలి పొరల్లో మగ్గిపోతున్న వేళ,
చిమ్మచీకట్ల గనుల్లో చితికిపోతున్న వేళ,
బ్రతుకుమీద ఆశ మృగ్యమవుతున్న వేళ,
ప్రాణవాయువు జాడ కనుమరుగవుతున్న వేళ,
ఒయ్యారి కోయిల సంగీతఝరి
**ఆ బాల కార్మికుడు ఎలా వినగలడు?**
అనుభవాలగనిలా, పండుటాకులా మిగిలిపోయిన వేళ
జీవితం చరమాంకపు తాకిడికి గురియైన వేళ
బ్రతుకు పుస్తకం చిరిగిపోతున్న వేళ
వృద్ధాశ్రమపు నిశీధులలోనికి విసిరి వేయబడ్డ వేళ
**వేపపువ్వు సుగంధాలను ఆ వృద్ధుడు ఎలా ఆస్వాదించగలడు?**
కోటి రూపాయల కట్నాన్ని సమర్పించుకునే వేళ,
అత్తగారి పదునైన పదజాలానికి ఆహుతయ్యే వేళ,
ఆడపడుచు వేధింపులకు తాళలేని వేళ,
**గుమ్మమామిడి గుబురు అందాలను ఆ వనిత ఎలా సంతరించుకోగలదు?**
ముద్దులొలికే చిన్నారిని కొలిమిలో కాల్చే వేళ
నూరేళ్ల పసిడి జీవితాన్ని నులిమేసిన వేళ
కిరాతకుల కాఠిన్యానికి ఆమొగ్గ బలియైన వేళ
షడ్రుచుల సంగమ జీవన మాధుర్యాలను
**ఆ చిట్టితల్లి ఎలా రుచి చూడగలదు?**
చట్టాలను తమ చుట్టాలుగా మార్చుకునే వేళ
కనకమంతా తమ కొట్టాలలో కూర్చుకునే వేళ
నోట్లతో ఓట్లన్నీ కొనేసే వేళ
**అందాల ఉగాది సంబరాలను ఆ ప్రజాస్వామ్యం ఎలా జరుపుకోగలదు?**
కోటి పలుగులతో నేలతల్లిని ఖూనీ చేసే వేళ
ఆకాశాన్నందే హర్మ్యాలు నిర్మించే వేళ
పచ్చ పచ్చని చెట్లను పెకలించే వేళ
నవయవ్వన వసంతలక్ష్మి చందాన
**ఆ నేలతల్లి ఎలా చిరునవ్వులు చిందించగలదు?**





## అత్యంత ఆశ

కోపూరి పుష్పాదేవి
విజయవాడ

భూమి పరిభ్రమిస్తూనే ఉంటుంది
కాలం కదులుతూనే ఉంటుంది

మోడులవటం, చివురించడం...
పుష్పించడం, ఫలించడం...

ఋతుచక్రం ఎల్లప్పుడూ మారుతూనే ఉంటుంది
మారనిది కూడా ఒకటుంది

అది చలించదు
అది కృంగదు... అది కృశించదు

మంచీ చెడూ చూడదు
అర్థాతో, అనర్థాతో అస్సలు ఆలోచించదు

చెడు దారులే దాని చరిత్ర...
పెడ పోకడలే దానికి పరమాన్నం

పెరగడమే కానీ తరగడం
దాని వశంలో లేదూ, వంశంలోనూ లేదు

ఓ ఆమనీ... కాస్తయినా బుద్ధి చెప్పు
మా బుద్ధులకు

ఓ కోయిలా....
కొంతయినా జ్ఞానం ఇవ్వు మా మనసులకు

ఓ వికృతి నామ సంవత్సరమా....
నిజానికి నువ్వు వికృతివి కాదు

మా ప్రకృతులను సరిచేసేందుకు వచ్చిన సుకృతివి
అందుకే.... అందుకే....

మా అత్యాశలను పరిహరిస్తావని
నాకు అత్యంత ఆశగా ఉంది.

## ఓరోరి ... తెలంగాణా

మైనేపల్లి సుబ్రమణ్యం
ఆకునూరు

ఓరోరి... తెలంగాణా
దొరలకు నేవే దొరసానివి
దొరసానికి – దొరతనంపై మనసాయే
నెలవంకలాంటి రారాజు నీభూమి

నీ భూమి నీ సొంతం
దొరలకు నీవే దొరసానివి
జరాజరా వాన నీమోము పులకింత
బిరబిరా వరద – నీ కన్నీరే
నెలవంకలాంటి రారాజు – ఎంత వరకు ఎదుగు
ప్రకృతి రహస్యం తెలుసుకో
దొరలకు – దొరసానికి వంగి నంగి సలామ్

నీ బాంచను కాల్మొక్తా.
ఇదే నీ ఘన చరిత్ర
ఆకాశాన్ని మబ్బు క్రమ్మును
నీ నేల గుక్కెడు నీటినే త్రాగును
నీరు పల్లమునే ఎరుంగును

నీ భూమి నీ సొంతం – ప్రకృతి రహస్యం తెలుసుకో
సర్కారు సాయమిచ్చిందని
కోరినన్ని బోరు బావులు
నీ వేదనకు – మేలిముసుగు
దొరసానికి దొరతనం మేలిముసుగు
ఆ మేలిముసుగు – చిన్నారుల పాలిట
మృత్యు సొరంగాలుగా వర్ధిల్లు!

(తెలంగాలోని బోరుబావుల వలన ఎంతమంది చిన్నారులు
మృత్యువాతపడుచున్నారో? ఆ.. ఆవేదనే ఈ రచనకు నన్ను ప్రోత్సహించింది)





## ఉగాది - వికృతి

ఎ.యమ్.యమ్. కుమార్
విజయవాడ

ఎవరు ఎంతగొప్పగా పొగిడినా
ఎవరు ఎంతగా బుజ్జగించినా
ఎవరు ఎంత ధీమాగా వున్నా
విరోధి నామ సంవత్సరం
చివరకు విరోధాన్ని మిగిల్చింది.
వికృతి నామ సంవత్సరం
పరిస్థితులని వికృత పరుస్తుందో
శాంతి సామరస్యాల్ని నెలకొల్పుతుందో
నిర్ణయించాలి రాబోయే కాలం
ఒకే కొమ్మమీద ప్రక్క ప్రక్కన కూర్చుని
ఆప్యాయతలు ఒలక బోసుకుంటూ
లేత మావిచిగురులు మేసి
వసంతరాగాలు ఆలపించే
కోయిలలుఎదురెదురుగా కొమ్మమీద
కూర్చుని
కసితో అపస్వరాలు పాడుతున్నాయి
అసహనంతో వూగిపోతున్నాయి
క్రొత్తక్రొత్తరాగాలు ఆలపిస్తున్నాయి

గుమ్మం ముందుకు వచ్చిన అతిథిని
స్వాగత సత్కారాలతో ఆహ్వానం
తెలుగువారి సంస్కృతి సంప్రదాయము
వికృతి నామ సంవత్సరానికి
సౌహార్దంతో స్వాగతం పలుకుదాం

అందరి జీవితాల్లో ఆనందం
వెల్లివిరుస్తుందని నమ్ముదాం.

ఆ శ్రీ కృష్ణ పరమాత్మ
మోహన మురళీ రాగం
సుధామాధుర్యం
అందిస్తుందని ఆశిద్దాం.

## జై జవాన్

కాట్రగడ్డ వెంకట్రావు
పామర్రు

మానవజన్మకు సార్థకం చేకూరుస్తూ
రేయింబవళ్ళు సరిహద్దులను
పహారా కాస్తూ

ఆకలి దప్పులను మరిచి
అహర్నిశలు శ్రమించి
దేశ రక్షణ కోసం
శత్రువుల గుండెల్లో
ఫిరంగులు మ్రోగిస్తూ
జన్మభూమి ఋణం తీర్చుకుంటున్న
భరతమాత ముద్దు బిడ్డలు
వీర జవానులు  మీరే
భరతమాత గుండెల్లో
కొలువై ఉండే అసలైన
ముద్దుబిడ్డలు మీరే !

## వికృతి నామ సంవత్సర ఉగాదికి స్వాగత వాక్కులు

ఓగిరాల వెంకట
సుబ్రహ్మణ్యం
విజయవాడ

సీ॥ విధి వైపరీత్యాల నెదిరించి ధైర్యంబు
సడలనీయక ముందు సాగినాము
మానవ తప్పిదాల్ మారణహోమాలు
రెచ్చిపోయినను భరించినాము
పగటిదొంగల వేట భయభ్రాంతులన్ గొల్ప
ప్రాణాలు గుప్పిట పట్టినాము
నడిరోడ్లపై జనులు నరుకుకొంటను గాంచి
ద్వారముల్ మూసుకు దాగినాము

తే॥ అగ్నిమంటల దలపించె నధిక ధరలు
బీదవారల బాధలు పెచ్చు పెరిగె
గడచె గత వత్సరం బంత గడ్డుగానె
విధిగ స్వాగతమిడరమ్ము వికృతికిని!!



మహా కవితా వసంతం

## వికృతీ! సుకృతిగా మారిపో

డా॥ దీవి చిన్మయ
ఉయ్యూరు

వికృతీ! స్వాగతమ్ – శుభ స్వాగతమ్
సుకృతిగా మారాలి – నీ శుభ ఆగమనమ్

శాతవాహన ఆంధ్ర సామ్రాజ్య ప్రాభవం
తిరిగి రావాలనీ
కృష్ణరాయల భువన విజయపు సాహితీ
సౌరభాన్ని మరల ఆస్వాదించాలనీ
రుద్రమాంబ తెలుగు వాహిని  పౌరుషాగ్ని
పునర్వికాసం పొందాలనే
మా ఆశలు నెరవేర్చిపో, సుకృతిగా మారిపో!   ॥ వికృతీ! స్వాగతమ్ ॥

కన్న తల్లి కడుపు చీల్చె తెలుగు బిడ్డల
అమానుషత్వం
తల్లి భాషను నాది కాదనే దుందుడుకు
మనస్తత్వం
రాజకీయ రొంపితో హోళికా కేళియాడే
మహోన్మత్తం
అట్టి హృదిని మార్చిపో, సుకృతిగా మారిపో...   ॥ వికృతీ! స్వాగతమ్ ॥

తెలుగు జాతి వొక్కటనీ
తెలుగు నేల వొక్కటనీ
తెలుగు భాష వొక్కటనీ
"హస్తిన"కు తెల్పిపో, సుకృతిగా మారిపో!

## మరకలు పడ్డ మానవత్వం

వేలూరి కౌండిన్య
విజయవాడ

ఆ కుర్రాడు నాకు ప్రతీ రోజూ బస్‌స్టాపులో కనిపిస్తాడు
ఆ పక్క ఓ కుర్రది చిరుగులు పట్టిన బట్టలతో మాతృత్వపు గుర్తులు అస్పష్టంగా కనిపిస్తూ
వాళ్ళ తండ్రులను చూస్తే వాళ్ళకు భయం
వాడి మొఖాన ప్రజాస్వామ్యం భేతాళుడిలా వ్రేలాడుతూ వుంటాడు
వాడి చేతితో సత్తు బొచ్చె
ప్రపంచ బ్యాంకు అప్పుకోసం పరుగులు పెడుతున్న ఆర్థికమంత్రిలా
వాడి కళ్ళల్లో నిరాశ, నిస్పృహలు, ఆకలి బావురుమంటోది.
బస్సు కోసం నిలబడ్డపుడల్లా
చిల్లర కోసం వాడు చాచిన చేతులు
అయ్యవార్ల నట్టిల్లులా వుంటుంది
బొచ్చెలో చిల్లర పడ్డపుడల్లా
శివతాండవం ఆడినట్లుగా వాడి బొచ్చె
విచిత్ర ధ్వనులు చేస్తూ వుంటుంది.

బస్సు ఆగగానే ఆవైపు పరుగులు తీస్తాడు
టక్ చేసుకున్న పోరడు
ప్రియురాలికి ప్రేమ సందేశాలు ఇస్తూవుంటాడు.
ఆ పక్కగా ఓ హీరోహోండా ఆగుతుంది
డబ్బు మైకంతో తూలుతూ వుంటుంది
కుర్రవాడికి అర్థరూపాయి ఇవ్వటం
ఆస్తినంతా రాసి ఇచ్చినంత బరువుగా వుంటుంది
రెడ్ సిగ్నల్ చూసి బెంజికారు ఆగుతుంది
ఊరి రోడ్లన్నీ తన ఆమాంబాపతు బానిసలన్నట్లు
హారను కొడుతుంది
మిగిలిన వాళ్ళ మాటల్లో బూతులు
కారుకలాయనవి 'కారు' కూతలు
బక్కచిక్కిన దరిద్ర నారాయణునికి బిక్కచచ్చి పోవటం తెలియదు





చెల్లని చెక్కుబుక్‌లాంటి మొఖం
పగిలి ముక్కలైనవాడి గుండెల్లో ఆవిరి ఎగిసి పడుతూ వుంటుంది.
ఆకలి కేకల వెనక బడబాగ్ని వుంటుందని తెలియదు
మానవత్వం చినిగి పేలికలైందని తెలియదు
నిశిరాత్రి వేళల్లో దారి చూపించే స్కూటర్ దీపాలు వాడికళ్ళే
హీరోహోండా చక్రాల చువ్వలు వాడి ఎముకల నరాలే
కారు ముందుకు నడిచేది వాడి రక్తంతోనే
వాడి చేతిలో రూపాయి పడితే
వాడి కళ్ళు సచిన్ బ్యాటులా మెరుస్తుంది
వాడి బొచ్చె వేయి పడగలవుతుంది
ఎక్కడ నుంచో ఓ పోలీసు వాడి కేక
ఎవడ్రా అక్కడ నా కొ.. డ..కా..
వాడి బొచ్చెలో చిల్లర జేబులు మారుతుంది
వాడి కళ్ళల్లో నిరాశ
బస్సు సిగ్నల్ దాటి ముందుకు వెళుతుంది
స్కూటర్ వెనుక కూర్చున్న ప్రియురాలు ప్రేమగా హత్తుకుంటుంది
కారు కలాయన సూట్‌కేసును ప్రేమగా తాకుతాడు
వాడి కళ్ళు రౌద్రంగా మారుతాయి.
క్షణంలో రూపం మార్చుకొని బేలగా అవుతాయి
మళ్ళీ మామూలే.

**(పిల్లలచేత భిక్షం ఎత్తించకూడదన్న ప్రభుత్వం ప్రకటన చూసి)**

## ఉగాది వంటివారు ...

కె. ఆంజనేయ కుమార్
విజయవాడ

పురుషులలో పుణ్యపురుషులున్నట్టు...
యుగ పురుషులలో 'ఉగాది' పురుషులుంటారనుకుంటామా...
కానీ వారు 'తగాదా' పురుషుల్లా "అద్దె" పాక్ ఐకాస పురుషులుగా
నిరూపించుకుందామనుకుంటున్నారేమో!
షడ్రుచుల్లా వుండాల్సిన వాళ్ళు.. షట్ నాలుకలతో విషాద సోపానాలవుతున్నారు.
నదులు... ఎక్కడివక్కడే ఆగిపోవాలన్నట్లు
విద్యార్థుల పరీక్షా పత్రాలు... ఎక్కడివక్కడే దిద్దాలంటున్నారు.
ఈ ఉగాది పురుషులు ... పచ్చడిక్కూడా కొత్త నిర్వచనాలిస్తూ
వేప పువ్వు బదులు.. వేప గింజలు
మామిడి పిందెలకు బదులు ... మామిడి పువ్వు కలిపి
ఇది మా చరిత్ర .. మా సంస్కృతి  అంటూ
వితండవాదం... తండాలుగా దండేలు కడుతున్నారు.
చీపురుకి బారెడు కర్ర కట్టి
నడుం వంచకుండా ఊడుస్తున్న వాళ్ళలా..
ఛానళ్ళతో బోలెడు ఊదరకొట్టి..
ఇక్కడ ఊడ్చిన ధనాన్ని గుజరాత్ ఓడ రేవుల్లో పూడ్చి పెడితే
డబ్బు చెట్టు మొలుస్తుందని కలలు కంటూ
విభజన ప్రియులు... తమకు భోజన ప్రియత్వం లేదని
నిమ్మరసం తాగేసి... కొత్త దేవుళ్ళమని
సురాపానీయం .... వీరదొరలది మాత్రమేనని వాదిస్తున్నారు కదా!
బస్టాండ్ కొచ్చిన వాళ్లంతా
ఊళ్ళెళ్ళడానికే వచ్చారని మనమనుకుంటుంటే
దాన్నొక పునరావాస కేంద్రంగా మార్చుకుందామనుకుంటున్న వాళ్ళు...
ఏ రొదా లేదు కాబట్టి
కదలని బస్సుకి ఎయిర్ హారన్ కొట్టినట్టు....
ఎంత వేడుకున్నా సరే
కదలని కర్కశ మనస్సులతో
టెర్రర్ సృష్టిస్తామని వీరంగాలు చేస్తున్నారు కదా!

ఈ ఉగాది పేరుని సార్థకం చేద్దామని... వికృతంగా ఆలోచిస్తున్నవారు...
విరోధులని వికృతం చేయడమంటే... సహృదయంతో సమైక్యం చేయడమేనని
తెలుసుకోని వారు..... సహజ ప్రకృతిలో ఆకృతులేక కలిసిపోతారు.





## తెలుగు తల్లి

సింహాద్రి పద్మ
అవనిగడ్డ

అమ్మ అమ్మదనాన్ని వర్షిస్తుంది!
కరుణ రసాన్ని ఒలికిస్తుంది!
అమ్మంటే బ్రతుకు సమస్యలకు పూరించిన పోరాటశంఖం!
మమతల మానవేతిహాసం!
పద బంధుత్వ, జీవన ప్రబంధం!
అనుభవాల అమృతసారం!
మమకారాల ప్రమిదలో...
జీవకారుణ్యం వెలుగుతున్న వత్తి
అమ్మది జన్మాంతరాల భాషా సౌరభం!
సర్వప్రకృతిలోని మృదుత్వ కాఠిన్యాలను
రెండంచుల చీరగ ధరించిన నాతల్లి,
ముద్దు మురిపాల 'ఆదిమ' తల్లి!
తేటతేనె మాటల "గోండు" తల్లి!
ఓదార్పుల ఒడి చేర్చుకునే "సీమ" తల్లి!
సతత హరితమైన "కోస్తా" తల్లి!
అతి కమ్మని,  బోనాల బతుకమ్మ "తెలంగాణా" తల్లి!
మాండలికాల సడి, చిరుమువ్వల సవ్వడి!
అమ్మ వాక్కులు, తేనెల వాగులు!
అలరించే సమ్మోహన శక్తి... జాబిల్లిని అందించే యుక్తి!
అనాది జీవన రాగం! వెలిగే మణిదీపం! భాషలందు "తెలుగు లెస్స"!
వ్యామోహపు డాలర్ల జీవన వ్యాపారంతో
మాయా వినిమయ జగత్తు లో ....
తల్లిని మరచిన పిల్లలు,
వృద్ధాశ్రమాల పంచన పడేసిన వంచకులు
మమ్మీ, డాడీలుగ
కాన్వెంట్ ఇంగ్లీషు మైకంతో
విదేశీ ప్రయాణపు భ్రమావలయంలో చిక్కుకున్నాం!
మించి పోయింది లేదు
అమ్మ నాన్నలుగ మారి
అమ్మను అచ్చం అమ్మగ ఉంచుదాం!
కలం పట్టుకొని
తెలుగు తల్లి అక్షరాలు బతికిద్దాం!
కమనీయ కవితా సుమాలుగ పరిమళిద్దాం
జై తెలుగుతల్లి!

# ఓ విరోధి నీకు స్వస్తి

వేలూరి సుధారాణి
విజయవాడ

మార్చి పదహారు మంగళవారం
ఉత్తరాభాద్ర నక్షత్రం మొదటి పాదం
ప్రకృతిలోకి వికృతి అడుగు పెట్టబోతుంది
కుజుడు రాజ్యాధిపతి, సేనాధిపతియై
అగ్ని, జల, యుద్ధ, రోగాది భయాలు కల్పించినా
శుక్రుడు సస్యాధిపతియై, గురుడు ధాన్యాధిపతియై,
రాష్ట్రాన్ని సుభిక్షంగా ఉంచాలని కోరుకుంటున్నా...

సూర్యుడు రసాధిపతిగా తీపిని ఆకాశానికి కొనిపోతే
శుక్రుడు నీరసాధిపతియై "పసిడి" ధర మరింత ప్రియంచేశాడు
ఓ "వికృతి" నీకు ప్రణామము
ఈ కీచక అరాచకాలను
"వికృత" మానవ చేష్టలను, మృగాలుగా మారిన మనుషులను
మృత్యుకుహరాలుగా మారే మహానగరాలను
"ఉద్యమోన్మాద" పూనకంతో ఊగుతున్న జనాన్ని
రాష్ట్రాన్ని ముక్కలు చేసి, ప్రజల బ్రతుకుల్ని
రక్త సిక్తంచేసే స్వార్థ రాజకీయ రాక్షసత్వాన్ని
ఆధ్యాత్మికతను ఆదాయవనరులుగా మార్చే
బురిడి "బాబాల నుండి" రక్షణ కల్పించవమ్మా
ప్రతి "లోగిలి" మమతల కోవెలగా మార్చి
మానవత్వమనే మామిడి కాయ పచ్చడిని
మాచే తినిపించి మనుషులుగా మార్చవమ్మా...
అందరికి, శ్రీ వికృతి నామ ఉగాది శుభాకాంక్షలు.





# "వికృతి" వత్సరంబ! విభవమిమ్ము

గుడిసేవ విష్ణు ప్రసాద్
అవనిగడ్డ

ఆ॥వె॥ తెలుగు చివురు మెక్కి తెలుగు కోయిల పాడు
సరసమైన పదాలు జావళీలు
తెలుగుదనము నిల్పి తేజరిల్లగ నేడు
వికృతి వత్సరంబ! విభవమిమ్ము!!

ఆ॥వె॥ తెలుగు వారలంత తెలుగు వత్సరాది
జరుపుకొన్న చాల జయము కలుగు
ప్రకృతి పరవశించి పరిఢవిల్లుచునుండు
వికృతి వత్సరంబ! విభవమిమ్ము!!

ఆ॥వె॥ విరిసె వేపపూత వెన్నెల నవ్వులా
కురిసె కోకిలమ్మ కూజితములు
స్వాగతంబు పలికె చల్లని తెమ్మెరల్
వికృతి వత్సరంబ! విభవమిమ్ము!!

ఆ॥వె॥ తేనెపల్కులొల్కు తెలుగువిద్యార్థికి
అధిక ప్రేమపుట్టె నాంగ్లమనిన
రెండురాని యట్టి రేవడి కాకుండ
వికృతి వత్సరంబ!విభవమిమ్ము

ఆ॥వె॥ అమ్మభాష నెచట నవరోధపరచినా
ఆదుకొనగ నిలువు మాంధ్రవీర!
భాష శ్వాస మనకు, భాషయే ప్రాణంబు!!
వికృతి వత్సరంబ! విభవమిమ్ము!!

## మహాంధ్ర

టి. రామలక్ష్మణాచార్యులు
విజయవాడ

1. సీ॥ నన్నయ్య కవనాన జననమై వికసించె
తేటతేనియలొల్కు తెలుగు తోట
తిక్కన్న కైతలో తీయనై సాగింది
ఆంధ్రమందంతట భారతమ్ము
పోతన్న కవితతో పూతమై వెలిసింది
తెలగాణ యిల జాను తెలుగునేల
వేమన్న పద్యాలు సీమలోనే గాదు
తెలుగు భాషకె వన్నె తెచ్చి పెట్టె

మావి చివురుల మేపరి మధురమైన
గొంతుతో కూయ సమైక్య కూజితంబు
ఆంధ్రజాతికి క్రొవ్వెల్గులవతరింప
నవ్య వికృతి వచ్చె కుసుమ నయన యగుచు.

2. పోతన సోమనాదుల యపూర్వ కవిత్వ పరీమళంబులే
ఓతము ప్రోతమై యిల మహోన్నతమై చెలగంగ ఆంధ్రమున్
వీత మనోనురాగులయి వేర్వడ నెంతురదేమి చిత్రమో
బ్రాతి పడంగనేల యిల భాగము చేయగ నాంధ్రరాష్ట్రమున్.

ఆంధ్రము పేరు చక్కనిది యాంధ్రపు రూపము చక్కనైనదీ
యాంధ్రము నాద్యమై నిలచె నన్నిట పేరులందునా
ఆంధ్రపు కట్టుబొట్టె మరి యాశ్రయమాయెగ యన్యజాతికిన్
ఆంధ్రపు వంటకంబులవి యన్యులకున్ చవులూర్చుగా భళీ!

స్వాగతమో శుభాన్విత సమాగత నూతన వత్సరంబ మ
మ్మేగతి నేలెదో వికృతి మేలుగ సాత్త్విక భావజాలముల్
తీగలు సాగి మామతుల తీయని సౌహృద రాగవల్లికల్
ప్రోగయి, యైకమత్యమున భోగిలగా వాలె తెల్గులందరున్.

పొమ్మిక నో! విరోధి యిల పొందగు నాంధ్ర మనంబులన్ విరో
ధమ్మును బుట్టజేసితివి దైత్యసమంబగు బుద్ధిజూపియున్
మమ్ముల వేరుచేయగ ప్రభూతపిశాచిని వైతివే యిలన్
కొమ్మఖిలాంధ్రకోటి పరికోపిత మానస దండమున్ భళీ!

రమ్మిక వైకృతంబ మరి రాగిలి సార్థక నామధేయవై
మమ్ముల నాంధ్రసోదరుల మానసమందున భేదభావముల్
నెమ్మిని పెంచి ప్రాకృతము నిక్కము వైకృతమెంచి చేసెదో
సుమ్మఖిలాంధ్ర దేశమును స్రుక్క విభాగము చేయబోకుమా !





## స్వాగతం

విష్ణుభొట్ల ప్రసూన రామకృష్ణ
విజయవాడ

స్వాగతం ఉగాది మాతా – స్వాగతం
విరోధినామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుదాం
వికృతి నామ సంవత్సరానికి స్వాగతం పలుకుదాం
విరోధిలో వికృతాలకు
వీడ్కోలు పలుకుదాం
వికృతిలో అవరోధాలు
కల్గకూడదని కోరుకుందాం
విరోధిలో
ఓ రాజకీయ తార నేలరాలింది
కరువు కాటకాలు – కరాళ నృత్యాలు చేసాయి
రాష్ట్రం ముక్కలయ్యేందుకు సిద్ధమయ్యింది
రాజకీయం – రంగు మారింది
అన్నదమ్ములు – కత్తులు దూసుకొన్నారు
ఆత్మత్యాగాలు చేసుకొని
తల్లిదండ్రులకు క్షోభమిగిల్చారు
కన్నవారి కలలు – కల్లలు చేసారు
తెలుగు తల్లి, తెలంగాణా తల్లులను
రాజకీయ నాయకులు పావులుగా మార్చుకొని
ఒక తల్లిని రెండు తల్లులుగా చీల్చారు
దేశాన్ని ముక్కలుగా చేయాలని చూస్తున్నారు
మన మనస్సుల్లో విషబీజం నాటుతున్నారు
మన ఐకమత్యాన్ని నీరు కారుస్తున్నారు
రాజకీయ పబ్బం గడుపుకొంటున్నారు
ఇవన్ని గత సంవత్సరపు
చేదు గుళికలు – విరోధిగా తరలి వెళ్ళాయి
గత కాలపు అనుభవాల్లి గుర్తుంచుకొని
రాబోవు ఉగాది పులుపూ, తీపి, చేదులను
మన జీవితంలో నింపుకొని
సమిష్టిగా జీవిద్దాం
ఉగాది మాతకు సమైక్య మంగళ హారతులతో స్వాగతం పలుకుదాం!

## మహిళా ఉగాది

కోకా విమల కుమారి
విజయవాడ

ప్రభాత వేళలో మావిచివురులు మత్తుగా మేసిన కోయిల కుహూరవాలు పలికింది
వసంతగామన సందడుల సరంభం ఆరంభమయింది మా వాడలో
యుగ యుగాల ఉగాది వసంతం వస్తూనే మాతృభాష ప్రాచీనతకు
మంచి బాటలు పరిచి మహిళా చైతన్యానికి పెద్ద పీట వేసింది
అందుకే మహిళనైన నేను మహిళాభివృద్ధి పథాన పయనిస్తాను
ఓ మహిళా! అమరంబగు నీ చరిత అనంతం అద్వితీయం
ప్రేమకు పెన్నిధివి మమతల మంచుపొరవు – మహిమాన్విత మాతృమూర్తివి
సమతా మమతల సహనశీలివి. సృష్టికి మూలం నీవమ్మా!
చింతల బాపును నీచిరునవ్వు, భార్యగ తల్లీ తనయిగ
చరిత్ర నారివై నీధర్మం నెరవేర్చిన నాడు నీమదికే తృప్తి
మరి లోకము గుర్తించునా నీశక్తి! వలదు వలదు నీకా అనుమానాల ఆసక్తి
ఎలుగెత్తి చాటుచుండె ఎనలేని నీయుక్తి!
మానవతామ తల్లివి మరుపరాని మహిళవు కవి హృదయ కమలానివి
కలియుగ చైతన్యవు కలం పట్టిన కవయిత్రివి నేటి రాజ్ఞివి
వెలుగుతావు జ్యోతివై కరుగుతావు కరుణవై కరిగి కరిగి
నీరై నిలిచిన నిన్ను గని మెచ్చలేని నాటి మెరుగులలోకమే
అచ్చెరువందెను సాటిలేని మేటి మేధస్సంపదగని
విద్యావేత్తవు, విజ్ఞానఖనివి, వినయవిధేయవు
విమానాలు నడిపావు, విదేశాలకెళ్ళావు, అంతరిక్షంలోనూ విహరించావు
టెస్టుట్యూబ్ బేబీని సృష్టించావు ఎవరెస్టు శిఖరాన్నధిరోహించావు
నదిని ఈదావు నాట్య భంగిమల నర్తించి సంగీత సామ్రాజ్యమేలినావు
'శకుంతల' రూపాన హ్యూమన్ కంప్యూటరువెనావు
సాహిత్యాన సవ్యసాచివై జ్ఞానపీఠ్ అవార్డు నరిదినావు
స్వర్ణ కంకణాలందినావు అనాథ సేవల తరియించి నోబుల్ బహుమతినందిన
మదర్ థెరిస్సావై మహిళా లోకానికే గర్వకారణమైనావు
అన్నింటిని మించిన అసమాన వనితలు ఆత్మ స్థైర్యపు అతివలు
'సావిత్రి, వైదేహి' లోను మహిళలు వృద్ధ మహిళలకు ఆశ్రమాన్ని స్థాపించి
స్వచ్ఛంద సేవలందించి కీర్తి పతాకాన్నందుచున్నారు
ప్రజాస్వామ్య పాలనలో రాజకీయరంగాన అధికారహోదాలో
అనేకానేక పాత్రల నధిరోహించి నీ శక్తియుక్తులు చాటావు
క్రీడారంగాన పొందినావు ఎనలేని యశమును అందినావు అవార్డులహారాలను
పారిశ్రామిక వేత్తగ, స్వాతంత్ర్య సమరయోధినిగ సంసారసాగరాన్ని
మధించిన సకల సద్గుణరాసిగ వాసికెక్కిన వనితవు అలుపెరుగని అతివవు
జటిలమైన జర్నలిజాన్ని ఆపోసనపట్టిన తొలిమహిళా మణివి. (విమూపాటిల్)
తెలుగు భాషల తరించి తెలుగు వెలుగు పూలు పూయించినావు
చట్టసభల 33శాతం మహిళా బిల్లును సాధించి సాధికారతను సార్థకం చేశావు
'సమస్యల సుడిగుండాలు దాటు సవ్యమైన యోచన నీది
అందలేవు నీవు శాశ్వత కీర్తివన్నారు. పొందలేవు నీవు ప్రజాప్రశంసలన్నారు
త్యాగమూర్తివై నిలచిన నిన్ను గని నిదించిన నిన్నటి లోకమే
నీరు గారె నేటి నీప్రగతి పథపు ప్రతిభ గని
నీవు 'సబల' వేగాని అబలవు కానే కావు మరపురాని
నీ చరిత్ర స్త్రీ జాతికే సుచరిత్ర – అందుకే
అందు చున్నావు నేడసమాన ప్రతిభా పాటవాల ప్రశంసల్ని
విరోధి నామ సంవత్సర, వసంతుడందించిన చేదు అనుభవాల చిట్టాను నెమరువేస్తున్నాను.
ఓ వికృతి నామ వసంతమా! వేడుకొంటున్నాను నిన్ను
నిష్కల్మష హృదయాన మహిళాభివృద్ధి పథంలో మము నడిపించమని
మా హక్కుల స్వాతంత్రాన్ని సక్రమ మార్గాన సద్వినియోగపరచు దిశగా
మము నడిపించు! అప్పుడే ఆహ్వానిస్తాను నిన్ను
షడ్రుచుల ఉగాది పచ్చడితో, గారెలు బూరెలు
పరమాన్నపు విందుతో పరమానంద భరితనై.





## .... ఆహ్వానం ....

భమిడి పాటి బాలాత్రిపురసుందరి
విజయవాడ

మళ్ళీ వచ్చేసింది కొత్త సంవత్సరం
కాని, కొత్త మార్పుతో ....
ఎదురు చూసే భూలోక వాసులకు
భూదేవంత ఓర్పు
త్రికాలాలకు లేదిపుడు మార్పు
వసంత శోభకూ..... ఏమార్పే!
మామిడి చిగుళ్ళు తినకుండానే....
గండు కోయిలల కూజితాలు
వేప చేదు తగలకుండా...
పాలకులకు సుపూజితాలు!
బెల్లం పండించద్దంటు...రైతన్నలకు బెదిరింపులు
వస్తున్న ఉగాదికి.... అందరికీ తగ్గుతుంది 'తీపు'
నిద్రలేస్తూనే పాలప్యాకెట్టుతో మొదలై
నిద్రపోయే ముందు దోమల బ్యాట్టు వరకు
ఉగాదికి ముందు పరీక్ష ఫీజులు
ఆపై కొత్త చదువులకు ఫీజులు
ఆకాశాన్నంటిన ధరలు ..... అందుకోలేని
ఇంటి యజమానుల ఆత్మహత్యలు
ప్రేమకు వారధి 'సెల్లు' ... వద్దంటె ప్రేమకు 'చెల్లు'
ప్రేమే ఈనాటి స్టాటస్ సింబల్...
మేమందిస్తాం రావే బుల్ బుల్!
ప్రేమోన్మాదులతో కత్తిమీదసాము
ఉన్మాద దేవతకి.... బాలికల బలిదానం
తెలుగు ఉగాదికి తెలుగు భాష సోయగం
తెలుగు ఛానళ్ళందిస్తున్నాయి – ఒత్తి పలకతేని 'నత్తిరసం'
అరె, ఒసె, ఏరా! ఈనాటి సరసం
సినిమాలకి లేవు 'ఒత్తిడులు' ... అక్కడ దుస్తులకూ 'కత్తిడులే!'
వికృతంగా మార్చడానికి సమాజానికి మేమున్నాం
కలియుగ స్వాముల బోధ... ఇక కల్కి భగవానుడే రక్ష!
మాసిపోతున్న మంచితనాన్ని... తెరమరుగవుతున్న తెలుగు తనాన్ని
శృతి చేసే కృతికర్తగా రావాలని కోరుతూ
వికృతి నామ సంవత్సరాన్ని సవినయంగా ఆహ్వానిస్తున్నాం.

## ఆంధ్రమాత ఆవేదన

శ్రీహరికోటి
వేల్పుచర్ల

1. సీ॥ ఆంధ్రప్రదేశమై యవనికే తేజమై
యాచంద్ర తారార్కమై వెలుంగ
అండనుండిన వారి నడ్డగించు జన తె
లంగాణ గానమున్ భంగపడితి
అరమరికలు లేక యైక్యమైయుండ వి
రోధి వత్సరమున్ విరోధులైరి
అన్నదమ్ముల మధ్య యంతరమ్మణచి సం
తోషకాంతులు నింపు ఘోష నాది

గీ॥ తల్లీ! భారతాంబ! తనయుల కలహాలు
చిలికి చిలికి గుండె చీల్చుచుండె
కృష్ణ! కృష్ణ! ఈ ‘వికృతి’ నామ వత్సరమ్
ప్రాకృతికము గానె బ్రతుకనిమ్ము

2. ఆ॥ వె॥ తెలుగు తల్లి బంధమ్ముగా వెలుగుచుంటి
అంధకార బంధురమౌదు బంధము తెగ
ఐకమత్యమ్ముతోడ నన్నాదరింప
అవని కాదర్శమైయుందు ననవరతము

3. సీ॥ తెల్లవారల గుండెఁ గల్లోల పరచిన
‘అల్లూరి’ విల్లంబు లనుజులార!
ఆ ఆమరణ నిరాహార దీక్షా దక్ష!
పొట్టి శ్రీరాములు పట్టులార!
ఎక్కుపెట్టఁ దుపాకి కెదురొమ్ముజూపిన
‘ఆంధ్రకేసరి’ పౌరుషాత్మలార!
నడుముం బసిని గట్టి యరిసేన నణచిన
‘ఝాన్సి లక్ష్మీబాయి’ జాణలార!

తే॥గీ॥ ఆంధ్రమును పల్కు నా సుకుమారులార!
ఆలకించుమా మీతల్లి యాత్మ ఘోష
దీక్షబూని నన్నాంధ్ర ప్రదేశముగనె
యుండు భాగ్యమ్ము కలుగ జేయండి కలసి.





## వసంతం

వడ్డాది లక్ష్మీసుభద్ర
విజయవాడ

వచ్చింది వచ్చింది వసంతము
తెచ్చింది తెచ్చింది ఉల్లాసము
కొత్తరుచులు ఇచ్చింది కొత్త చిగురులు తెచ్చింది
మావి కొమ్మల మీద కూసింది కోయిలమ్మ
కోకిలమ్మ పాటలతో సంతోషం కలిగింది
గోరు వంక కోసం అర్రులు చాచింది
వనమంతా పూసింది బ్రతుకు తెరువు నిచ్చింది ॥వచ్చింది॥
స్వార్థంలేని ప్రకృతి శోభయే దేవుడురా
పగలు మరిచి పోయి కలిసిమెలిసి ఉండండి
నాలుగు రోజులకేలరా? ద్వేషం మానండి
ప్రేమతో బ్రతకండి ఆదరించండందరిని ॥వచ్చింది॥
మూడునాళ్ళ ముచ్చటకు ఆశపడనేలరా
వచ్చింది ఊరకనే పోయేది ఊరకనే
లేని దాని కోసం అర్రులుచాచే వెందుకురా
ఉన్నదానితోనే జీవితం గడపరా
లేనిదాని కోసం దిగులు పడకురా
నీది అయితే అది నీదరికే చేరురా
రానిదయితే మాత్రం రాగాలు తీయకురా
మానవత్వం పాటించరా మానవుడిగా
మసలరా ప్రకృతి చూసి తెలుసుకోరా
యుగాదిచ్చే యీ సందేశం వినరా మానవుడా ॥వచ్చింది॥

## కృషి

వి. శ్రీ ఉమామహేశ్వరి
విజయవాడ

విరోధినామ ఉగాది
సార్థకనామధేయురాలయ్యింది
అన్నదమ్ముల మధ్య చిచ్చు పెట్టి
ఆంధ్ర తెలంగాణ విభేధాలు రెచ్చగొట్టి
బందుల పేర కడగండ్ల పాల్జేసి
ధర్నాల పేర అష్టకష్టాల్లో నిలబెట్టి
ఎన్నో - ఎన్నో మరెన్నో మలుపులు తిప్పి
సామాన్యుల్ని ముప్పతిప్పలు పెట్టి
వికటాట్ట హాసం చేసింది

మరి వచ్చే వికృతో!
మనసు మార్చుకొని రాష్ట్ర సమైక్యతను
సాధించాలని
కలసి ఉంటే కలదు సుఖం అని
చేయి చేయి కలిపి సాగాలని ఆశిద్దాం
తెలుగుజాతి మనది
తెగుళ్ళు లేని జాతి మనది అని నినదిద్దాం
తెలుగు భాష - తెలుగు గడ్డ
విచ్ఛిన్నంకాకుండా కృషిచేద్దాం.

బతికేవాడు అన్నిటినీ బతకనివ్వాలి
ప్రపంచం మంచికే సొంతంకాదు
ప్రపంచం మనిషితో అంతంకాదు. - పాపినేని శివ శంకర్





## 'విరోధి' 'వికృతిగా' మారుతున్న 'వేళ'

చిత్తజల్లు భవానీ శంకరరావు
ఉయ్యూరు

కలగంటినొకనాడు సాహితీసమరాంగణ ప్రాంగణమునందు
కవి హంసలలోన హంసనై హాయిగా విహరించవలయునని
కలగంటి నొకనాడు ఈ కవితా కోవెలయందు కోయిలలో
కోయిలనై కవితాగాన మొనర్చ వలయునని! అడుగిడితి నేడిట్లు 'సరసభారతికి'

విరోధులు ఒక్కటై పాలసంద్రము చిల్క అమృతము కంటె ముందు హాలాహలము పుట్టె
నిరోధించ ముక్కంటి నీల కంఠుడయ్యె దాన్ని (అమృతము) పంచ హరి విశ్వమోహిని అయ్యె
విరోధి కని కుపితుడై నల చక్రవర్తిని బాహుకుడుగ మార్చె రంభ అర్జునుని పేడిగా మార్చె
విరోధులు ఎన్ని అవరోధములు కల్పించినను అవి మన మంచికేనని భావించిన మేలుచేయు.

శతవసంత మహిళ దినోత్సవము సాధించి తెచ్చికొన్న కొనియాడదగు బిరుదములను
చిన్ని పాపాయిసరస సంగీత సాహిత్య సేవలు పండి ఫలముల నందించుచున్నవి బాలగీర్వాణి
బిందుదత్త శ్రీ కి నేడు
పుట్టునది మొదలు గిట్టు వరకు సేవలు జేసిచేసి అలసి సొలసిన తల్లికి పిల్ల లిచ్చు ఆనందమందెడి వేళ
మహిళలార యిప్పుడైన ముందుకు రండి భయము వీడి బలవంతపు పనులకు స్వస్తి చెప్పి

విభవలో పుట్టె నీనగరమున సాహితీమండలి లంకావారి సారథ్యంలో అక్షరకాంతితో విశ్వశాంతిని సాధించ
విరోధిలో పుట్టె నీసరసభారతి గబ్బిట వారి సారథ్యమున అక్షరం లోక రక్షణం సాధించనెంచి
అన్నమయ్య పదాలతో, త్యాగయ్యకీర్తనలతో, గాన గంధర్వ అపరఘంటసాల పాటలతో
పురప్రముఖుల దీవెనలతో
'వికృతి' పులకరించి పదికాలములపాటు సాహిత్య భారతికి సేవ చేయ సరసభారతిని దీవించమని వేడుచుంటి.

## పండుగకై

శ్రీ కాట్రగడ్డ
పెదపాడు

పండుగకై పాడవలెను
పండుగకై ఆడవలెను
పండుగ నా గుండెను మార్మోగవలెను
పండించిన పంటలాగ
పైటొంచిన పడతిలాగ
చెఱుకుపువ్వు సొగసు మొగసి
చురుకు చూపు కన్ను నొరసి
అల కోవెల హారతియై
ఇల తావులు 'భారతి'యై
మెలుకువ అలికిడి జీవితమై
చేయి చేయి కలిపి నడుపు
చేవనెరిగి, కలిసినపుడు
పగలే వెన్నెలయో పదారుప్రాయంలో
వలపుల ఉయ్యాల జోడు మదీయ
భావనలో
కోయిలలా కూయగా
మయూరిలా నే నాడగా
పండుగకై పాడగలిగి
ప్రపంచాన్ని చూడమెలిగి
అచంచల విశ్వాసంతో
వినయ శ్వాస జీవితాన
విజయ హాస ప్రభాతమై
వికాసాంధ్ర వినోదాన
విప్లవాల ప్రమోదమై
పండుగకై పాడుతా!
పండుగకై నే నాడుతా!!
ఊరూరున వుదయరజం
ఉయ్యూరున మధురస్వరం
గ్రంథాలయ శాఖ మాటు
కోయిలనై, నే కవితాలయ కావలికై





## తెగులు ఉగాది

కూచిభొట్ల శ్రీరామచంద్రమూర్తి
ఉయ్యూరు

చిగురు తెలుగు కొమ్మ చీరను చుట్టంగ
చిమ్మెటలు సగము చింపదలచె
కావిరంగు వసంత కవ్వింత రంజిత
కాషాయ వర్ణాల కాంక్ష తీర్చె
కత్తులు బ్లేడులు కాముడు దెచ్చెను
కుసుమశరంబులు కుదరవింక
మాదక ద్రవ్యంబు మధుపంబు సేవించి
మకరంద పుప్పొడి మరచి పోయె

ప్రకృతి కవరోధము విరోధి ప్రాభవంబు
వికృతి తత్త్వపు చేష్టల విద్యనేర్చె
ఆంగ్ల వత్సర వేడుక లలరి నట్లు
తెలుగు నేల యుగాదులు తెలియ విపుడు.

నేను సౌందర్యపు గుట్టను – తవ్వుకో – తరగను
నేను గంధకాన్ని గుండెల్లో దాచుకున్న కొండని
నీ కోసం అక్షరమైన వాడ్ని
నాలో విశ్రమించు – నాలో అన్వేషించు
కవిత్వమే వినిపిస్తానో – కదన రంగాన నడిపిస్తానో
నేను చెప్పను – చెప్పలేను మనిషీ
నన్ను నమ్ము – చినుకు చినుకుగా ద్రవిస్తున్న
రేపటి వెలుగు కోసం – రేపటి వెన్నెల కోసమూ

– పి. చంద్రశేఖర అజాద్

నిదురనిచ్చగించబోక, బెదురులేక
ఆకలి కేకలనిడు అర్భకాంశ పర్వానికి
వాకిలి వ్యాకులతను వింగడించు దర్పాన,
సేదదీర్చు సహజాతుల సన్నుతించి పాడుతా
సమయసేవ సమాజాన వెన్నువొంచి ఆడుతా
సద్గురువుల సమతావని మమతనొలచి
సమ్మతాన ప్రభుభక్తుల పార్శ్వమొరసి
ప్రగతి ప్రాంత ఫలితాల పర్వాంతరహర్షమై
ప్రతిభ స్వాంతనలనేలు దీక్షాశ్రమ సాక్షినై
స్వరమెత్తిపాడుతా కృష్ణానది లహరినై
సలిలాంధ్ర సమ్ముఖాల సందీప్తుల మొహరునై
వాడ వాడ కలయజూడ
వేడుకయౌ జాడలెరిగి
ఉగాది కోయిలనై పాడవలెను-పాడుతా!
ఉగాది వూయలనై నేనూగవలెను- ఊగుతా!
భవితవ్యపు బాటలపై భావాల నమర్చుతూ
భారతీయ తోటలలో రుచిర స్వరాలాపనలో
పండుగకై పాడవలెను
పండుగకై ఆడవలెను
గడపల ఉగాది పండుగ
గగనతలం తాకగా,
మడవల మహాంధ్ర బీజాల్
మనోంబరాన మొలవగా,
విజయస్వర విశాల పరిధి
వినయాంజలి మెరుపులా,
వికసిత వదన విలాసాల
సుకవుల శ్వాస లమరగా,
సుక్షేత్రాల ఫలితరాశి
అక్షయమని సంక్షేమ సమాజాన
హర్షాంధ్రావని నిక్వణాలు వినగా,
జనగణాలు నేడుగాది హేల కనగా
పండుగకై పాడవలెను
పండుగకై ఆడవలెను
పండుగ నా గుండెను మార్మ్రోగవలెను.





## అక్షరమాల

ఈమని శేషయ్య
నూజివీడు

శ్రీయుత గబ్బిటేంద్ర! గుణసింధుజ
చంద్రుడ! కీర్తి సాంద్రుడ
పాయక నెల్లవేళలను పావన సాహితి
కంకితార్యుడా!
ధీయుత మూర్తియై నిలచు తెల్గమ
సేవకు బద్ధకంకణా
గేయముచే నుతింతు మిము గేల
సుమంబుల నందజేయుచున్

## వికృతి - ప్రకృతి

కె. శోభనాచలం
గరికపర్రు

విపత్తులనెన్నిటినో నెదిరించిన మనం
విరోధి నామకు వీడ్కోలు చెప్పి
విఘ్నాలను కలిగించకు తల్లీ అని
ఉత్సాహంగా-వుల్లాసంగా
కాలుష్యాన్నరికట్టి-ప్రకృతిని కాపాడుదాం అని
ప్రతిన బూనుదాం-వికృతినామకు విన్నవించుదాం
సుఖశాంతులు వెల్లి విరియాలి
ఉగాది పర్వదినాన-వూరూర
వికృతినామ-ప్రకృతి కృపతో.

## వికృతీ - విశిష్ట కృతిచేయి

గబ్బిట దుర్గాప్రసాద్
ఉయ్యూరు

విపత్తులు, విషాదాలు, కడగండ్లు
విభజన రేఖలు దాటి
కల్లోలం, బీభత్సం, కన్నీటి వరదలు గడిచి
కొత్త ఉగాది ఉదయిస్తుందనుకుంటే
పేరులోనే భయానకంగా వున్న నిన్ను
ఆహ్వానించటానికి జంకుగా వుంది
గుండె ఝల్లుగానే వుంది
విరోధి సాగించిన విరోధం సమసి పోలేదింకా
రావణ కాష్టమై రగులుతూనే వుంది
ఓదార్చే తీరికా, ఓపికాలేని వినాయక గణం
ఏమార్చే ఉపాయంతో అధికార గణం
ఐనా ఇన్ని కవి కోకిలలు
మధుమధుర కుహు స్వనాలతో
శుభాశంసనం చేసి
ముంగిట్లోకి ఆహ్వానిస్తున్నాయి
వికృతీ! నీ ఆకృతి మార్చుకో – విశిష్టకృతి చేయి
నీ ప్రకృతి మార్చుకో – సుకృతినివ్వు
ఆపై వచ్చే ఖలుడు ముష్కరుడు 'ఖరుడు'
శ్రేయస్కరుడై శోభస్కరుడయ్యే మార్గం నువ్వే చూపాలి
తెలుగుకు పట్టం గట్టే దిశా నిర్దేశం చేయి
అప్పుడే జనహృదయాలకు కొత్త ఉగాది.





## విరోధమా !

పాణిగ్రాహి రాజశేఖర్
విజయవాడ

ఓ విరోధి నామ సంవత్సరమా!
మాపై నీకంతటి విరోధమా!
విలయాలు, ప్రళయాలు
విస్ఫోటనలతో
కకావికలం చేశావు
కనీవినీ ఎరుగని రీతిలో
కృష్ణమ్మకు ఉగ్ర రూపం తెప్పించావు
ఎందరినో అభాగ్యుల్ని చేశావు
మరెందరినో రోడ్డుకు ఈడ్చేశావు
హత్యలు... ఆత్మహత్యలు
దొమ్మీలు... దోపిడీలు
ఏమున్నది... గర్వకారణం
విరోధినామ సంవత్సరం
పేదల పెన్నిధి రాజశేఖరుడిని
నీ సన్నిధికి చేర్చుకున్నావు
అభం శుభం తెలియని చిన్నారులను
పాశవికంగా హతమార్చావు
మానవత్వపు విలువలు దిగజార్చావు
మనుషులలో కుతంత్రపు ఆలోచనలు రేకెత్తించావు
ప్రాంతీయ వాదులతో
సమ్మెలు... బందులతో
రాష్ట్రాలను అట్టుడికించావు
ఈ సమరంలో ఎందరినో
అమాయకులను సమిధలుగా మార్చావు
సమైక్య తెలంగాణాల మంటల వద్ద
ఏమీ ఎరగనన్నట్లు చలి కాచుకుంటున్నావు
విరోధిలో విజయాల కన్నా
అపజయాలే మిన్న
రాబోయే వికృతికైనా
ప్రకృతి కరుణించాలని
ఆశిస్తూ.... ఆకాంక్షిస్తూ......

## పల్లెటూరు మన భాగ్యసీమరా !

డా॥ జి. రెజీనా
విజయవాడ

పచ్చని పంటపొలాలు, పైరగాలి
ఒళ్ళువంచి పనిచేసే రైతుకూలీలు
శ్రమ సౌందర్యానికి ఆకలి తోడై
సేదతీరే బడుగు జీవులు
వావి వరుసలతో ఊసులాడుకునే దృశ్యాలు
కష్టసుఖాలు పాలుపంచుకునే అల్ప జీవులు
పండగంటే ఊరంతా ఏకమవుతారు
కల్లాకపట మెరుగని బాల్యంతో పుస్తకాల బరువు
అమ్మానాన్నను విడువలేక పయనమయ్యే బాల్యం
స్కూలు ముందు చిల్లర సరకులతో చిరువ్యాపారులు
కొని, పంచుకొని తినే ఆనందం ఇంతింత కాదయా
పండగంటే ఎంతపని ఎంత సందడి
దేవుని పెళ్ళికి అందరూ పెద్దలే
కొడిపందేలు, ఎడ్లబండలాగుడు, పొట్టేళ్ళ కుమ్ములాటలు
మూగిన జనం కేరింతల హోరు, చప్పట్ల జోరు

    భూమిని నమ్మిన వాడెపుడు చెడిపోడురా
    నీ ధనాన్ని భూమిపై పెట్టు అదే నిన్ను కాపాడు
    దాచుకున్న ధనం దోచబడును, బంగారం
    కరెన్సీలు దొంగలెత్తుకు పోదురు
    కడదాక నిన్ను అక్కున చేర్చుకునేది భూమేరా!

బంతులు, జాజి మల్లె మరువం కనకాంబరాలు
చిక్కుడు, బెండ, బీర, సొర, గుమ్మడి కాయలతో
ప్రతి లోగిలి సొగసులీనుతూ ఆహ్వానాలు పలుకుతాయి
నారికేళ, అరటి, పనస, జామ, ఉసిరి, నారింజలతో
పురిపోసిన ధాన్యరాశులతో, గొడ్ల చావిళ్ళతో
పాలేరులకు పని పురమాయింపులు, కొలువైన దైవానికి
నిత్యహారతులు, కృషీవలుల యింట నిత్య సౌభాగ్యాలు
అతిథి మర్యాదలు, రచ్చబండ కాలక్షేపాదులు



మహా కవితా వసంతం

నిండైన పంచెకట్టుతో ఠీవిగా నిలిచే రైతు
ఊరికంతటికి రాజు...మహారాజు
కుంకుమ శోభిత, ధానధర్మాలకు పెద్ద పీటయై
ఇంటి ఇల్లాలు, మహాలక్ష్మిసమానురాలు
పట్టుపరికిణీలు, జడకుప్పెలు, తలనిండ పూదండ దాల్చి
పడతులు కనులతో భావాలు పలికించగల జాణలు
కోరమీసము దువ్వే కోడెగాండ్ర వలపు పరాచకాలు
పిండివంటలు పోహళింపులు కొత్తల్లుళ్ళ గారాలు
కట్నకానుకలకు పెద్ద పండుగలు ఆకరాలు

    నాకన్నతల్లి ఉన్న ఊరు
    ఆ గాలి, ఆ ధూళి, ఈ నీరు
    నాకెంతో ప్రియం ప్రియం

ఆ బడి, ఆ గుడి జేగంటలు
ఎద్దుల మెడలోని గంటల ధ్వని
పుల్లయిసు బండి, బజ్జీల బండి
లంక పొగాకు చుట్ట వాసనలు
బామ్మచేతి నేతి అరిసెలు, గారెలు
ఏ దేశమేగిన, ఎందు కాలిడినా
చిన్ననాటి చెదరని జ్ఞాపకాలు
అమెరికా కాని, ఆముదాలవలస కాని
పులస రుచి కాని, పోకిరీ చేష్టలు కాని
పంతుళ్ళు చెవి మెలివేయడం
హరిదాసులు, గంగిరెద్దులు, భోగిమంటలు
పులివేషాలు, కోలాటం, భజనలు
జాతరలు, తెప్పోత్సవాలు, తిరునాళ్ళు
ఎన్నని చెప్పను, పల్లెసీమ అందాలు
పంచరంగులద్ది పలుకుపలుకునా తియ్యందనంతో
పల్లెటూర్లే మన భాగ్యసీమయనిపించు.

## రావమ్మ వికృతీ రావమ్మా

వంగిపురపు వీర రాఘవాచారి
గుడివాడ

1. సీ. పచ్చని మామిళ్ళు పరువాల రెమ్మల
తోరణాలను గట్టి తీర్చినాయి
లోగిళ్ళ ముంగిళ్ళు లోలోన నుప్పొంగి
ముత్యాల ముగ్గుల ముదము గూర్చ
చిలుక గోరింకలు, చిన్నారి కోయిళ్ళు
క్రొత్త రాగాలతో కోరి పిలువ
కండ చక్కెరపాల కమ్మని పాయసం
వేడివేడిగ నీకై వేచియుండె
ఆ.వె ఘల్లు ఘల్లు మనుచు కాలినందెలు మ్రోగ
చల్ల చల్ల జూపు జాలు వార
అభయ హస్త మొసగి యాంధ్రుల కాపాడ
విమల కోమలాంగి వేగ రావె
2.సీ. తెల్లని పొగమంచు తెరలను తొలగించి
సంజకెంజాయలో స్నానమాడి
తొలిపొద్దు వెలుగుల నులిరేకుజంపాల
చేనేత మగ్గాల చీరగట్టి
పూతోట గాలించి పుణికి తెచ్చినపూలు
కొలువుదీరిన వింత కొప్పుతోడ
చిరుగాలి కవ్వించ చీరాడు ముంగుర్లు
మొలక నవ్వులు జారు మోముతోడ
ఆ.వె. తెలుగు సీమలందు వెలుగునింపార
తెలుగు జాతి ఘనత తేజరిల్ల
కాలు మోపు వికృతి కళ్యాణివై నీవు
సాదరమున వేగ సాగి రావె
3.సీ. వేప పూలను కోసి వేడ్కతో సవరించి
మేలి చింత పులుపు మేళవించి
లేత మామిడి పింద లింపుగా సమకూర్చి
చిన్న చిన్న ముక్కలు చేసి కలిపి
చెఱకు ముక్కలు వేసి జీల కర్రను వేసి
క్రొత్త బెల్లపు పొడి కోరి కలిపి





శుభాకాంక్షలు ....

పెళ్ళూరి శేషుకుమారి
విజయవాడ

నిత్య నూతన తేజస్వి
అవిశ్రాంత సమవర్తి
అపరిష్కృత అభినేత్రి కాలం.......
ఈ కదలికలో ప్రతి మలుపు ఒక మధుర తలపు
ఆవర్తనమయ్యే ఈ భ్రమణంలో
వికృతినామ వత్సరాన్ని ఆహ్వానిస్తూ
వేపపూతను, చింత పులుపును, మామిడి ముక్కను
చెఱకు తీపిని ఉప్పుతో రంగరించి
ఉగాది పచ్చడిని సేవిస్తూ
పరాయితనానికి వలస పోవద్దని
భాషలెన్ని నేర్చినా మాతృభాషను మరవవద్దని
కుటుంబ వ్యవస్థను కూలద్రోయవద్దని
మానవతా సంబంధాలను మరచి పోరాదని నిర్దేశిస్తూ
అందరికి అందిద్దాం శుభాకాంక్షలు.

దేశ భాషలందు తెలుగు లెస్సను మాట
వన్నె తరుగనట్టి వాస్తవము
తెలుగు భాష కన్న తీపి లేదనుమాట
వాసి తరుగనట్టి వాస్తవమ్ము

– మల్లెమాల

పగటికొక్కటే సూర్యదీపము
శుక్ల పక్షము చాంద్రరూపము
పగలు రేయనకుండ – జగతిలో ఎటనున్న
తెలుగు ఒకటే ఇంద్రచాపమ్ము

– నాగభైరవ కోటేశ్వరరావు

భక్తి భావనతోడ శక్తి యుక్తిని పెంచ
సరిక్రొత్త పచ్చడి కోరి చేసి
ఆ.వె. చేదు వగరు పులుపుచే కూర్చు మేలును
జీవితమ్ము నమలు చేయదలచి
తీర్థమనుచు మేము తీసుకోనున్నాము
శుభము గూర్చ రావె శోభనాంగి.
4.సీ. ఒక్క నేలన పుట్టి యొక్క భాషను పల్కి
ఒక్క తీరున మనుదొక్క జాతి
అన్నదమ్ములమన్న యాలోచనే బాపి
కదనంబు తలపెట్టి కాంచుమమ్మ
తనయుల తప్పులు తల్లిగా సరిదిద్ది
ఐక్య భావన నింపు మాత్మలందు
అన్నదమ్ములు పోర నగచాట్ల వివరించి
ఆత్మీయ భావన లల్లుమమ్మ
ఆ.వె. కాల మాత వికృతి కరుణతో మము చేరి
కష్ట కాలమందు కావుమమ్మ
వికృతి మాత నీకు వేవేల ప్రణతులు
ఆదరమున నీవు యందుకొనుము
5.సీ. స్వార్థ చింతన బాపి సౌహార్దతను పెంచి
చరితార్థ తత్వంబు చాటుమమ్మ
కుటిల రాచరికపు కుట్రలే ఛేదించి
కూర్మి సౌజన్యత కూర్చుమమ్మ
తెలుగు జాతి కీర్తి దిశలెల్ల నింపగా
వేవేల మార్గాలు వేయుమమ్మ
భరత ఖండంబున భవ్యమై దివ్యమై
ఆంధ్ర రాష్ట్ర ఘనత నధిగమింప
ఆ.వె. గతపు కీడు చెప్పి కర్తవ్య ధీరులై
కార్యసాధనమున ఘనత చాట
అడుగు నడుగునందు అమ్మవై నడిపింప
స్వాగతంబు నీకు స్వాగతంబు.





## మినీ కవితలు

వసుధ బసవేశ్వరరావు
గుడివాడ

**వలస**
ఏళ్ళ తరబడి
కుహూ కుహూ రాగాలతో
అలరించిన కోయిలమ్మ
ఈ ఏడు జాడేలేదు!
అమెరికా వెళ్ళి పోయిందట!

**వికృతి**
అందమైన పేర్లతో
ఊరించిన ఉగాదులన్నీ
దగా చేసాయి
వికృతీ! నీవైనా
దయ చూపవూ!

**చైతన్యం**
శిశిర హృదయాలకు
వసంతపు గాలి సోకింది
ఆ హృదయాలు
ఇప్పుడు ఉత్సాహంతో
ఎగసిపడుతున్న అలలు!

**సంతతి**
డబ్బు, హోదా
లౌక్యం, తంత్రం, హింస
రాజకీయానికి
ముద్దు బిడ్డలు!

**వసంతం**
ఏడాది కోమారు వచ్చి
ఎండిన మనసుల్ని ఓదార్చి మళ్ళీ
విదేశాలకెగిరిపోయే
కుమారరత్నం

# సమయోచితం

'భాష్యం' కుమారి
విజయవాడ

ఎటు చూసినా ఏమున్నది
ఉదాశీనతల నిర్లిప్తతలు తప్ప
ఆకలి లోగిళ్ళు ఊహల వాకిళ్ళు
ఊపిరి తారట్లాటలో
ఎండిన గొంతుల ఆర్మెస్ట్రాతో
పేదరికం చిందులాట
పొగలు కక్కే పగలు.......ద్వేషాలు
గుండెల కంటిన తడి ఆరదు
పక్కమీద పచ్చి నెత్తురు మరకలు
పెదాలపై వంకర నవ్వులు
పడుపు వృత్తికై సవాళ్ళు
అన్నీ అబద్ధపు ఆనవాళ్ళే
దిగ జారిన విలువలు
దిక్కుమాలిన బతుకులు
భయోత్పాతంతో తెల్లారిపోతుంటే
మనిషి నిటారుగా నడుస్తున్నానంటున్నాడు
వ్యవస్థ మిడిసి పోతోంది
నవ్యతే లేదు.........నాగరికత కానరాదు
ఉపేక్షించడం కాదు కర్తవ్యం
చైతన్యం కోసం చేయి చాచి
అభ్యర్థించడం సమయోచితం





# ఉగాది కోయిల

మాదిరాజు శివలక్ష్మి
ఉయ్యూరు

ఉగాది కోయిల కూసింది! రాగం ఏదీ తెలియకనే!
దాని గొంతులో ఎంత మాధుర్యమో!
దాని కుహు కుహు పాటల్లో ఎంత కలవరమో!

1. మారని మనుషుల్ని చూసి
మార్పులేని సమాజాన్ని చూసి
జాలిలేని గుండెల్ని చూసి
ఎగసి పడే కిరాతకాన్ని చూసి! ॥ఉగాది॥

2. ఒకప్పుడు కార్ఖానాలు
జీవనానికి చిహ్నంగా ఉండేవి
ఇప్పుడో!
కసాయి తనానికి గుర్తుగా మిగిలి పోయాయి
అందుకేనేమో ॥ఉగాది॥

3. అరిషడ్వర్గాలకు విరోధి అవుతుందని ఆశిస్తే
ఈ విరోధి ఉవ్వెత్తున ఎగసిపడే కెరటంలా
మానవత్వానికే విరోధిగా మిగిలిందేమిటా అని
ఆవేదనతో కూస్తోంది ఉగాది కోయిల! అందుకే ॥ఉగాది॥

4. ఐకమత్యమే మేలని, కలసి ఉంటే కలదు సుఖమంటూ
ఆ స్థానాన్ని భర్తీ చేస్తూ
మీకో ఆకృతి నిస్తానంటూ
వికృతి వస్తోంది అందుకే
ఉగాది కోయిల కూసింది
రాగం ఏదో తెలుసుకొని ! ॥ఉగాది॥

## అమ్మకాని అమ్మ

టి.వి. సత్యనారాయణ
గుడివాడ

పచ్చాకుల చీర కట్టుకొని
నుదుట ఎర్రని పువ్వుబొట్టు పెట్టుకొని
కొమ్మల చేతులకు
మొగ్గల గాజులు తొడుక్కొని
చిరుగాలికి - తలూపుతుంటే
అచ్చంగా - మా అమ్మ
వెళ్ళొస్తా అమ్మా అంటే
క్షేమంగా వెళ్ళి లాభంగా రా
అన్నట్టే వుంటోందమ్మా!

## అమృతం అందిన రాత్రి

పి. విజయసారథి
ఉయ్యూరు

ఒక రోజు రాత్రి
ఆ బాల గంగాధరుడు తన
కవితా చక్కెర పలుకు తారకల్ని
పాల వెన్నెల్లో కలిపి, జాబిల్లి పాత్రలో పోసి
నా పెదవులకు అందించాడు
కవితామృతం - చవిచూసిన నేను
సాక్షాత్ - శ్రీమహావిష్ణువు
మోహినీరూపం దాల్చి - దేవామృతం తెచ్చి
దోసిట్లో పోస్తుంటే - వెగటుకల్గి
అన్నాను...........
ఈ అమృతంతాగి - కల కాలం బ్రతికి
ఏమి మేలు?
తిలక్ కవితామృతం త్రాగి
క్షణకాలం బ్రతికినా చాలు
మరుక్షణం మోహిని మాయమైంది
తిలక్ కవితామృతం శాశ్వతమైనిలిచింది -అమరుణ్ణి చేసింది.





## ప్రకృతి వికృతుల ధర్మైక్యత

పువ్వాడ తిక్కన సోమయాజి
విజయవాడ

1. ప్రతి వసంతోదయ ముగాది పర్వరమణి
రక్తి మీఱగ దాల్చెడి రాజసమును
గొనక-వికృతి నామమ్ము గైకొనినదంచు
భ్రాంతి జెందకోయి రసజ్ఞకాంత! నేడు!

2. అరవిచ్చు పరువాల మరుమల్లెల లతాంగి
సురభిళమ్ముల సిరుల్ తురగవింప
సరసానిలచల త్పల రసాల సాలమ్ము
చివురుల కేల్సాచి చెంగలించు
మలయమారుత గంధ మాధురీ లహరులన్
భ్రమర బృందమ్ములు భ్రమసి యాడ
ఎలదేటి సదులతో కలకంఠికుల కంఠ
నాదముల్ మిళితమై మోద మొసగ
మధుర మధుమాస విన్యాస మందహాస
పులకితానంద రసలోకముల తరింప,
విహరణము సల్పి నీ మనో వికృతి దులిచి
పరవశింపుమో రసరాజ ప్రకృతి మ్రోల!

3. ప్రకృతి- విశ్వాలోక రమణీయ కమనీయ
విపుల విష్ణుత్వ దృగ్విలసనమ్ము
ప్రకృతి - సౌందర్య సంపత్ప్రభా పరిపూర్ణ
లక్ష్మీ కటాక్ష విలాసరేఖ
ప్రకృతి - ఆత్మానందరస పారవశ్యక
మాహేశ్వర విభూతి మందిరమ్ము
ప్రకృతి - సమ్యక్పరబ్రహ్మైక్య సాధక
పరమేశ్వరీ కృపా స్ఫార ధార
పకృతి- జీవకోటి పరిపోషక సుధార
సార్ద్రభూమాతృ హృదయ సంస్పర్శనమ్ము!
ఆ ప్రకృతి పేరు వికృతియు నైన నేమి
ప్రజల కానంద దాయియై వరలు నెపుడు!